తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice
వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
16-09-2026
సోమవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 218
PUBLISHED FROM HYDERABAD | పేజీలు-8 | వెల:రూ.4 /-






## మండపాలు, నిమజ్జన కేంద్రాల వద్ద విద్యుత్ భద్రత పాటించాలి

- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్
- వినాయక నిమజ్జనోత్సవాలు, విద్యుత్ భద్రతపై సమీక్ష
- బాలాజీనగర్ ఐడీఎల్ చెరువు నిమజ్జన కేంద్రాన్ని సందర్శన

2

వినియోగదారులతో నిరంతరం మమేకమై వారి విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారానికి సిబ్బంది అందరూ అంకితభావంతో కృషి చేయాలని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ పేర్కొన్నారు.



8

## ట్రాన్స్‌కోలో అంతా పారదర్శకమే

- ఫెసిబిలిటీ జారీపై వస్తున్న ఆరోపణలు నిరాధారం
- డిస్కమ్‌ల పరిశీలన తర్వాతే దరఖాస్తులు వస్తాయి
- నిబంధనల ప్రకారమే స్పష్టత ఇస్తున్నాం

## తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త ఇంచార్జ్?

- మీనాక్షి నటరాజన్ స్థానంలో కొత్త నేత
- విదేశీ విద్య కోసం త్వరలో మీనాక్షి పయనం
- మరో రెండు నెలలు కొనసాగనున్న ప్రస్తుత ఇంచార్జ్?
- పరిశీలనలో సెంధిల్, చల్లకుమార్ పేర్లు
- ముకుల్ వాస్నిక్‌పైనా అధిష్ఠానం దృష్టి
- ముగ్గురిలో ఒకరికి బాధ్యతలు దక్కే అవకాశం

2





## తెరపై స్టెప్పులు.. తెర వెనుక తప్పులు



- 'ఢీ-10' విన్నర్, కొరియోగ్రాఫర్ కందిమళ్ల సాకేత్ రాజు అరెస్ట్, రిమాండ్
- ప్రేమ పేరుతో దగ్గరై.. సినిమా అవకాశాలు ఇప్పిస్తానని..
- నమ్మించి రూ.12 లక్షలకు పైగా వసూలు చేశాడంటూ బాధితురాలి ఫిర్యాదు

2

- నామినేటెడ్ పదవుల భర్తీలో కొత్త సమీకరణాలు
- సెప్టెంబరు నెలాఖరులోగా 50 కార్పొరేషన్లలో నియామకాలు
- జనాభా నిష్పత్తి ఆధారంగా సామాజిక న్యాయానికి ప్రాధాన్యం
- గతంలో ప్రాతినిధ్యం దక్కని కులాలకు అవకాశాలు
- పార్టీ కోసం పనిచేసిన నేతలకే అధిష్ఠానం మొగ్గు
- పాతవారిలో కొందరికి పునరావకాశంపై ప్రతిపాదనలు

# గేమ్ ఛేంజర్‌గా కులగణన జాబితా!

**హైదరాబాద్, సెప్టెంబరు 15:** తెలంగాణలో నామినేటెడ్ పదవుల భర్తీకి కులగణన జాబితా కీలకంగా మారుతోంది. సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఏఐసీసీ మార్గదర్శకాలు జారీ చేయడంతో, ప్రభుత్వ కులగణన నివేదికల ఆధారంగా పదవుల కేటాయింపుపై కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి సారించింది. గతంలో పెద్దగా ప్రాతినిధ్యం దక్కని కులాలకు అవకాశాలు కల్పించడంతో పాటు, పార్టీ కోసం క్షేత్రస్థాయిలో పనిచేసిన నేతలను ఎంపిక చేయాలని భావిస్తోంది.

**సెప్టెంబరు నెలాఖరులోగా భర్తీ**

తెలంగాణలో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. సుమారు 50 కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్ల

మిగతా 2వ పేజీలో..

## యూపీఐ ఛార్జీలపై కేంద్రం క్లారిటీ

- రూ.2 వేల వరకు యూపీఐ చెల్లింపులు ఉచితం
- పీ2పీ లావాదేవీలకు ఎలాంటి రుసుము లేదు
- చెల్లింపుదారు, స్వీకర్తపై ఛార్జీలు వద్దు
- బ్యాంకులు, చెల్లింపు సంస్థలు నిబంధనలు పాటించాల్సిందే

6




## పంతాలకు పోవద్దు.. పదోన్నతులు కోల్పోవద్దు

- ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తా
- డీజీపీ ఆనంద్

3



## విద్యకు ఎంత ఖర్చయినా వెనుకాడేది లేదు

- ఎస్సీ గురుకులాల్లో కేంద్రీకృత యంత్రాల వంటశాలలు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

3

## దసరా నుంచి కొత్త పింఛన్ల పంపిణీ

- ప్రభుత్వం కీలక నిర్ణయం
- కొత్తగా 2.50 లక్షల నూతన పింఛన్లు

3

## 2022 నాటి ఉద్యోగాల నోటిఫికేషన్ రద్దు

- నిరుద్యోగులకు టీజీపీఎస్సీ షాక్
- త్వరలోనే కొత్త నోటిఫికేషన్ విడుదల

2

## అక్కడ ఘనం.. ఇక్కడ భయం



- మజ్లిస్ భయంతోనే విమోచన దినం నిర్వహించడంలేదు
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌లపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఫైర్
- బీజేపీ మహిళా మోర్చా ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి

2

## తెలుగు రాష్ట్రాలకు 5 లక్షల ఇళ్లు

- ఏపీకి 3 లక్షలు.. తెలంగాణకు 2 లక్షలు
- దేశవ్యాప్తంగా 2 కోట్ల ఇళ్ల కేటాయింపు
- అదనంగా ఏపీకి 2.25 లక్షలు.. తెలంగాణకు 1.25 లక్షలు
- 'ఆవాస్ ప్లస్' యాప్‌తో లబ్ధిదారుల గుర్తింపు
- ఒక్కో ఇంటికి రూ.3 లక్షల వరకు సాయం
- రెండేళ్లలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసే లక్ష్యం





## కుల పంచాయితీ పేరుతో అమానుషం

- మహిళపై దారుణ హింసాకాండ
- చట్టానికి అతీతంగా వ్యవహరించిన కుల పెద్దలు
- సామాజిక మాధ్యమాల్లో వీడియోలు ప్రచారం
- ఇప్పటివరకు కలుగజేసుకోని పోలీసులు
- స్వయం ప్రకటిత పెద్దలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు

3

## తెలంగాణ సమర యోధులను స్మరించుకునేందుకే..

- ఏర్పాట్లను పరిశీలించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



2




# 2022 నాటి ఉద్యోగాల నోటిఫికేషన్ రద్దు

- నిరుద్యోగులకు టీజీపీఎస్సీ షాక్
- త్వరలోనే కొత్త నోటిఫికేషన్ విడుదల

**హైదరాబాద్, సెప్టెంబర్ 15:**
తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ( టీజీపీఎస్సీ ) బిగ్ అలర్ట్ ఇచ్చింది. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు (లెక్చరర్లు), ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి సంబంధించి 2022లో జారీ చేసిన బ్రీఫ్ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. మొత్తం 544 ఖాళీల భర్తీకి ఇచ్చిన ఈ నోటిఫికేషన్‌ను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు కమిషన్ వెబ్‌నోట్ ద్వారా వెల్లడించింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2022 డిసెంబర్ 31న కాలేజియేట్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లోని అసిస్టెంట్ ప్రొఫెసర్లు (లెక్చరర్లు), ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ పోస్టుల భర్తీ కోసం బ్రీఫ్ నోటిఫికేషన్ నంబర్ 33/2022ను విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 544 ఖాళీలను భర్తీ చేయాలని నిర్ణయించారు. అయితే ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన వివిధ అంశాలపై కమిషన్ సుదీర్ఘంగా చర్చించింది. అన్ని పరిస్థితులను సమగ్రంగా పరిశీలించిన తర్వాత 33/2022 బ్రీఫ్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని నిర్ణయించినట్లు టీజీపీఎస్సీ తాజాగా ప్రకటించింది. పాత నోటిఫికేషన్ రద్దు కావడంతో ఈ పోస్టుల భర్తీకి కొత్త నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. కొత్త నోటిఫికేషన్‌ను ప్రస్తుత నిబంధనలు, రోస్టర్ పాయింట్లు, రిజర్వేషన్ విధానాలకు అనుగుణంగా రూపొందించే అవకాశం ఉంది. కమిషన్ వెబ్‌నోట్ ప్రకారం 2022 డిసెంబర్ 31న జారీ చేసిన బ్రీఫ్ నోటిఫికేషన్ నంబర్ 33/2022ను తక్షణమే రద్దు చేశారు. 544 ఖాళీలకు సంబంధించిన ఈ నోటిఫికేషన్ ఇక చెల్లుబాటు కాదని అభ్యర్థులు గుర్తించాలని కమిషన్ సూచించింది. పాత నోటిఫికేషన్ రద్దు కావడంతో గతంలో జారీ చేసిన బ్రీఫ్ నోటిఫికేషన్ ఆధారంగా నియామక ప్రక్రియ కొనసాగదని అభ్యర్థులు గమనించాలి. కొత్త నోటిఫికేషన్ విడుదలైన తర్వాత అందులో పేర్కొనే పోస్టుల సంఖ్య, అర్హతలు, వయోపరిమితి, రిజర్వేషన్లు, దరఖాస్తు తేదీలు, ఎంపిక విధానం వంటి వివరాలను అభ్యర్థులు తప్పనిసరిగా పరిశీలించాలి. కొత్త నోటిఫికేషన్‌ను త్వరలోనే విడుదల చేయనున్నట్లు టీజీపీఎస్సీ తన వెబ్‌నోట్‌లో పేర్కొంది. దీంతో డిగ్రీ కాలేజీ లెక్చరర్, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్ పోస్టుల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు కొత్త ప్రకటన కోసం వేచి చూడాల్సి ఉంటుంది.

# తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త ఇంచార్జ్?

**హైదరాబాద్, సెప్టెంబరు 15:**
తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మార్పుపై పార్టీ వర్గాల్లో చర్చ మొదలైంది. ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్న మీనాక్షి నటరాజన్ త్వరలో ఉన్నత విద్య కోసం మరోసారి విదేశాలకు వెళ్లనున్న నేపథ్యంలో ఆమె స్థానంలో కొత్త ఇంచార్జ్‌ను నియమించే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే వెంటనే మార్పు చేయకుండా మరో రెండు నెలల పాటు మీనాక్షి నటరాజన్‌నే కొనసాగించే అవకాశముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**విదేశీ విద్య కోసం మీనాక్షి**
మీనాక్షి నటరాజన్ ఇప్పటికే దాదాపు పది నెలల పాటు విదేశాల్లో విద్యను అభ్యసించారు. ఉన్నత విద్య కోసం వచ్చిన అవకాశాన్ని వదులుకోవద్దన్న ఉద్దేశంతో పార్టీ నాయకత్వాన్ని ఒప్పించేందుకు ఆమె ప్రయత్నించగా అధిష్ఠానం అంగీకరించినట్లు సమాచారం. త్వరలో ఆమె మళ్లీ విదేశాలకు వెళ్లనున్న నేపథ్యంలో తెలంగాణకు కొత్త ఇంచార్జ్ నియామకం అనివార్యంగా కనిపిస్తోంది.

**ముగ్గురి పేర్లపై కసరత్తు**
కొత్త ఇంచార్జ్‌గా సీనియర్ నేతను నియమించాలనే ఆలోచనలో కాంగ్రెస్ అధిష్ఠానం ఉన్నట్లు తెలుస్తోంది. తమిళనాడుకు చెందిన ఎంపీ సెంథిల్ పేరు ఈ జాబితాలో ముందు వరుసలో ఉన్నట్లు సమాచారం. రాహుల్ గాంధీకి సన్నిహిత వర్గాల్లో కీలక నేతగా ఆయనకు పార్టీలో మంచి గుర్తింపు ఉందని చెబుతున్నారు. తమిళనాడుకే చెందిన మాజీ ఎంపీ చల్లకుమార్ పేరుతో పాటు సీనియర్ నేత ముకుల్ వాస్నిక్ పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తెలంగాణ కాంగ్రెస్‌లోని పలువురు నేతలతో వాస్నిక్‌కు సన్నిహిత సంబంధాలు ఉండటం ఆయనకు అనుకూల అంశంగా భావిస్తున్నారు. మొత్తంగా పరిశీలనలో ఉన్న ముగ్గురిలో ఒకరికి తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించే అవకాశం కనిపిస్తోంది. అయితే నియామకంపై తుది నిర్ణయం ఎప్పుడు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

# గేమ్ ఛేంజర్‌గా కులగణన జాబితా!

**మొదటిపేజీ తరువాయి**
పదవులను సెప్టెంబరు నెలాఖరులోగా భర్తీ చేయాలని భావిస్తోంది. సిద్ధం చేసిన అభ్యర్థుల జాబితాను సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు పంపి, వారి ఆమోదం అనంతరం అధికారిక ప్రకటన వెలువరించనున్నారు.

**సామాజిక సమీకరణాలపై దృష్టి**
నామినేటెడ్ పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు తగిన ప్రాధాన్యం కల్పించాలని ఏఐసీసీ సూచించింది. ఎస్సీ వర్గీకరణ అమలుతో జనాభా నిష్పత్తి ప్రకారం పదవులు కేటాయించాలని మాదిగ సామాజికవర్గ నేతలు డిమాండ్ చేస్తున్నారు. కులగణన నివేదిక ఆధారంగా గతంలో ప్రాతినిధ్యం తక్కువగా ఉన్న కులాలకు అవకాశాలు కల్పించేందుకు కసరత్తు సాగుతోంది. దీంతో ఈసారి పదవుల భర్తీలో కులగణన జాబితా కీలక పాత్ర పోషించనుంది.

**పార్టీ కోసం పనిచేసినవారికే ఛాన్స్**
పదవులు పొందిన కొందరు నేతలు పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా వ్యవహరించడం లేదని పీసీసీ అంతర్గత సమీక్షలో అసంతృప్తి వ్యక్తమైనట్లు తెలుస్తోంది. ఇలాంటి వారికి మళ్లీ అవకాశం ఇవ్వకుండా, పార్టీని బలోపేతం చేస్తూ ప్రజల మధ్య ఉంటున్న నేతలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించనున్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రుల నుంచి క్షేత్రస్థాయిలో పార్టీ కోసం శ్రమించిన నేతల జాబితాలను తెప్పించుకుని ఎంపిక చేయనున్నారు.

**పాతవారిలో కొందరికి పునరావకాశం**
2024 జులైలో రెండేళ్ల పదవీకాలంతో నియమితులైన పలువురు నేతల పదవీకాలం ఈ ఏడాది జులైతో ముగిసింది. నిర్మలా జగ్గారెడ్డి, పటేల్ రమేశ్‌రెడ్డి, శివసేనారెడ్డి, మెట్టు సాయికుమార్, ఈరవత్రి అనిల్, బెల్లయ్య నాయక్, ప్రీతం, మల్‌రెడ్డి రాంరెడ్డి, నూతి శ్రీకాంత్ తదితరులకు మరోసారి అవకాశం కల్పించే అంశంపై ప్రతిపాదనలు ఉన్నట్లు తెలుస్తోంది. శివసేనారెడ్డికి ఎమ్మెల్సీ టికెట్ దక్కకపోతే నామినేటెడ్ పదవి ఖరారయ్యే అవకాశముందని పార్టీలో చర్చ జరుగుతోంది.

**మంత్రి పదవుల ఆశావహులపై ప్రభావం**
తెలంగాణలో ఏడాదిపాటు చర్చనీయాంశంగా ఉన్న కేబినెట్ విస్తరణలో మహమ్మద్, అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరికి కొన్ని నెలల కిందట మంత్రి పదవులు దక్కాయి. మరో ముగ్గురికి అవకాశం ఉండటంతో పలువురు కాంగ్రెస్ నేతలు ఆశలు పెట్టుకున్నారు. తాజాగా మంత్రి కొండా సురేఖను కేబినెట్ నుంచి తొలగించడంతో నామినేటెడ్ పదవుల భర్తీ అంశం మరోసారి తెరపైకి వచ్చింది.

# తెరపై స్టెప్పులు.. తెర వెనుక తప్పులు

- పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం
- ఇతర మహిళలతో సంబంధాలు కొనసాగించాడని ఆరోపణలు
- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

**తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 15 (సిరి న్యూస్):**
ప్రముఖ టెలివిజన్ డ్యాన్స్ రియాలిటీ షో 'ఢీ10' విజేతగా గుర్తింపు పొందిన యువ కొరియోగ్రాఫర్ కందిమళ్ల సాకేత్ రాజు ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మియాపూర్ పోలీసుల చేతిలో అరెస్టై రిమాండ్‌కు వెళ్లిన ఘటన టాలీవుడ్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. బాధితురాలి ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణల ప్రకారం.. ప్రేమ పేరుతో దగ్గరై, సినిమా రంగంలో అవకాశాలు ఇప్పిస్తానని నమ్మించి, డ్యాన్స్ అసోసియేషన్ సభ్యత్వం తదితర అంశాల పేరుతో రూ.12 లక్షలకు పైగా నగదు తీసుకున్నాడని తీవ్ర ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. మియాపూర్ గోకుల్ ఫ్లాట్స్‌లో బొటిక్ నిర్వహిస్తున్న శిరీషకు సినిమా రంగంలో పెద్ద అవకాశాలు కల్పిస్తానని సాకేత్ రాజు ఆశ చూపినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి సన్నిహితంగా మెలిగిన ఆయన, మరోవైపు ఇతర మహిళలతో సంబంధాలు కొనసాగించాడని బాధితురాలు ఆరోపించారు. ఏళ్ల తరబడి పెళ్లి పేరుతో నమ్మిస్తూ వచ్చి, చివరకు ముఖం చాటేశాడని, ఫోన్లు కూడా ఎత్తకుండా దూరంగా ఉండటంతో తీవ్ర మనోవేదనకు గురై ఆమె పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. డ్యాన్స్ అసోసియేషన్‌లో సభ్యత్వం వస్తే కెరీర్ మెరుగవుతుందని నమ్మించి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశాడన్న ప్రధాన ఆరోపణపై పోలీసులు ప్రస్తుతం సమగ్ర దర్యాప్తు జరుపుతున్నారు. బాధితురాలి ఫిర్యాదును తీవ్రంగా పరిగణలోకి తీసుకున్న మియాపూర్ పోలీసులు సాకేత్ రాజుపై బీఎన్‌ఎస్ 69, 318(4) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. సెప్టెంబర్ 9న ఆయనను అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా, కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ప్రస్తుతం ఆయన చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్నారు.

**డ్యాన్స్ ఇండస్ట్రీలో 'కాస్టింగ్' మోసాలు..**
డ్యాన్స్‌పై ఆసక్తితో నగరానికి వచ్చే యువత స్టూడియోలు, రియాలిటీ షోలు, సినిమా అవకాశాల కోసం తీవ్రంగా శ్రమిస్తుంటారు. అయితే కొంతమందికి గుర్తింపు వచ్చిన తర్వాత ఏర్పడే పరిచయాలను కొందరు వ్యక్తులు దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణలు తరచూ వినిపిస్తున్నాయి. అవకాశాలు ఇప్పిస్తామని ఆశలు కల్పించడం, డబ్బులు వసూలు చేయడం, సంబంధాలు చెడిపోయిన తర్వాత బెదిరింపులకు పాల్పడటం వంటి ఘటనలు కలకలం రేపుతున్నాయి. పరువు, కెరీర్ దెబ్బతింటుందనే భయంతో పలువురు బాధితులు ఫిర్యాదు చేయడానికి వెనుకాడుతున్నప్పటికీ, శిరీష లాంటి బాధితులు ధైర్యంగా ముందుకు రావడం ఈ వ్యవహారాలపై మరోసారి చర్చకు దారితీసింది. తెలుగు సినిమా పరిశ్రమలో అనేక యూనియన్లు, సంఘాలు ఉన్నప్పటికీ సభ్యులపై వచ్చే లైంగిక వేధింపులు, ఆర్థిక మోసాల ఆరోపణలను సమర్థంగా పర్యవేక్షించే వ్యవస్థపై తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మహిళల భద్రత కోసం అంతర్గత ఫిర్యాదు వ్యవస్థలు, స్వతంత్ర పర్యవేక్షణ వేదికలు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని సినీరంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆరోపణలు నిజమా కాదా అనేది న్యాయస్థాన విచారణ, పోలీసు దర్యాప్తు తేల్చాల్సి ఉండగా.. తెరపై స్టెప్పులు వేయడం ఎంత కళో, తెర వెనుక జీవితాలతో ఆడుకోవడం అంతకంటే నేరమని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని సర్వత్రా చర్చ జరుగుతోంది.

# మండపాలు, నిమజ్జన కేంద్రాల వద్ద విద్యుత్ భద్రత పాటించాలి





**తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 15 (సిరి న్యూస్):**
మంగళవారం మేడ్చల్ సర్కిల్ పరిధిలోని కూకట్‌పల్లి సెక్షన్ పరిధిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మార్గంలో నిర్వహించిన 'ప్రజాబాట' కార్యక్రమంలో ఆయన ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ప్రజాబాట కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం ప్రజలకు మరింత చేరువ కావడం, వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టడమేనని స్పష్టం చేశారు. అధికారులు, ఉద్యోగులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. రాబోయే వినాయక ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాల నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినాయక మండపాలు, నిమజ్జన కేంద్రాల వద్ద విద్యుత్ భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించడంతో పాటు ఎ ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరాయ విద్యుత్ సరఫరా అందేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా విద్యుత్ వ్యవస్థ నిర్వహణపై సమీక్ష నిర్వహించిన సీఎండీ వాక్ అలోంగ్ ది లైన్ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, విద్యుత్ ఆస్తుల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ ప్రతి ఉద్యోగి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం సైబర్ సిటీ సర్కిల్ పరిధిలోని బాలాజీనగర్ ప్రాంతంలో ఉన్న ఐడీఎల్ చెరువు (బేబీ పాండ్) వినాయక నిమజ్జన కేంద్రాన్ని ఆయన స్వయంగా సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన తాత్కాలిక విద్యుత్ సదుపాయాలు, భద్రతా చర్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమాలకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయా లేదా అనే అంశంపై అధికారులతో సమీక్ష నిర్వహించి, ప్రజల ప్రాణాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సైబర్ సిటీ సూపరింటెండింగ్ ఇంజనీర్ చంద్రశేఖర్, కొండాపూర్ డీఈ శ్యామ్‌కుమార్, కేపీహెచ్‌బీ ఏడీఈ మాణిక్యల్, బాలాజీనగర్ ఏఈ భీమలింగప్ప మరియు ఇతర విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అక్కడ ఘనం.. ఇక్కడ భయం

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 :**
కర్ణాటక, మహారాష్ట్రల్లో తెలంగాణ విముక్తి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తుంటే తెలంగాణలో మాత్రం కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఎంఐఎం భయంతో నిర్వహించడం లేదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి మండిపడ్డారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించనున్న సందర్భాన్ని పురస్కరించుకుని బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం నుంచి అసెంబ్లీ ప్రాంగణంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వరకు మంగళవారం నిర్వహించిన మహిళా శక్తి స్కూటీ ర్యాలీని ఆయన ప్రారంభించి ర్యాలీలో బైక్ నడిపారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ నిజాం సైన్యం, రజాకార్లు గ్రామాలపై పడి ప్రజల, హిందువుల ఆస్తులను లూటీ చేస్తూ జాతీయ జెండా ఎగరేసినవారిని నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపుతూ మహిళలను చిత్రహింసలకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ దురాగతాలకు వ్యతిరేకంగా తెలంగాణ ఆడబిడ్డలు ధైర్యంగా పోరాడి తరిమికొట్టారని గుర్తుచేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జోక్యంతో సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రాంతానికి విముక్తి లభించి ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నారని తెలిపారు. నాటి హైదరాబాద్ సంస్థానంలో ఉన్న నేటి మరాఠ్వాడా, కర్ణాటక ప్రాంతాల్లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా హైదరాబాద్ ముక్తి దినోత్సవాలను నిర్వహిస్తున్నాయని, కానీ నిజాం పాలన ప్రధాన కేంద్రమైన హైదరాబాద్‌లోనే తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకపోవడం దురదృష్టకరమని అన్నారు. అమరవీరుల ఆత్మబలిదానాలు, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా అధికారికంగా హైదరాబాద్ ముక్తి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే ఈ చారిత్రక వేడుకలకు రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

**నాటి త్యాగాలను నేటి తరానికి**

**తెలపాలి : రామచందర్ రావు**
హైదరాబాద్ విముక్తి, భారత యూనియన్‌లో విలీనం వెనుక ఉన్న త్యాగాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని దశాబ్దాలుగా డిమాండ్ ఉన్నా ఎంఐఎం భయం, ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగానే గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు దీనిని నిరాకరిస్తున్నాయని మండిపడ్డారు. మహిళా శక్తి స్కూటీ ర్యాలీలో ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పాలన నుంచి భారతదేశం స్వాతంత్ర్యం దిశగా అడుగులు వేస్తున్న సమయంలో హైదరాబాద్‌ను ప్రత్యేక రాజ్యంగా ఉంచి పాకిస్థాన్‌తో కలపాలని నిజాం కుట్ర పన్నారని విమర్శించారు. నిజాం, రజాకార్ల పాలనలో తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా మహిళలు క్రూర హింసను ఎదుర్కొన్నారని రామచందర్ రావు తెలిపారు. తెలంగాణ బిడ్డలు ఎంతో ధైర్యంతో పోరాడారని, ఎందరో జాతీయవాదులు ప్రాణత్యాగం చేశారని, నిజాంకు వ్యతిరేకంగా గళమెత్తిన షోయబుల్లా ఖాన్‌ను సైతం హత్య చేశారని తెలిపారు. ప్రజల అసాధారణ ధైర్యం, త్యాగాలు చరిత్రలో నిలిచిపోయేవి అయినా గత ప్రభుత్వాలు ఆ వారసత్వాన్ని గౌరవించడంలో, వారి పోరాట గాథను సమాజానికి తెలియజేయడంలో విఫలమయ్యాయన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిల కృషితోనే కేంద్రం విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నదని, తద్వారా ఈ ఉజ్వల చరిత్రకు సరైన గుర్తింపు దక్కిందని తెలిపారు. విమోచన సందేశాన్ని, చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మహిళా శక్తి స్కూటీ ర్యాలీని విజయవంతంగా నిర్వహించిన మహిళా మోర్చా బృందాన్ని, పాల్గొన్న ప్రతి ఒక్కరినీ రామచందర్ రావు అభినందించారు.

# తెలంగాణ సమర యోధులను స్మరించుకునేందుకే..

- 17న పరేడ్ గ్రౌండ్స్‌లో విమోచన దినోత్సవం
- ఏర్పాట్లను పరిశీలించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 :**
ఆనాడు నిజాం పెట్టిన బాధలను భరించి తెలంగాణ ఆత్మగౌరవం కోసం ప్రాణాలర్పించిన సమరయోధులను స్మరించుకునేందుకు భారత ప్రభుత్వం 'హైదరాబాద్ ముక్తి దివస్‌ను ప్రారంభించిందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. పరేడ్ గ్రౌండ్స్‌లో ఈనెల 17న కేంద్ర ప్రభుత్వం నిర్వహించనున్న తెలంగాణ విమోచన దినోత్సవ (హైదరాబాద్ ముక్తి దివస్) ఏర్పాట్లను కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. కేంద్ర సాయుధ బలగాల కవాతు రిహార్సల్స్, సాంస్కృతిక ప్రదర్శనల సన్నాహాలను వీక్షించిన అనంతరం భద్రత, ట్రాఫిక్ మళ్లింపు, వీఐపీ ప్రొటోకాల్ తదితర అంశాలపై ఉన్నతాధికారులతో సమీక్షించి, ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ 1947 ఆగస్టు 15న దేశమంతటా స్వాతంత్ర్య పండుగ చేసుకుంటుంటే ఆనాడు నిజాం పాలనలోని హైదరాబాద్ సంస్థానంలో మాత్రం మనకు స్వాతంత్ర్యం రాలేదని గుర్తు చేశారు. గ్రామగ్రామాన రజాకార్లు హిందువులపై దాడులు, దమనకాండ కొనసాగిస్తూ భయంకరమైన వాతావరణాన్ని సృష్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ దమనకాండ నుంచి తమను, గ్రామాన్ని కాపాడుకునేందుకు ప్రజలే స్వయంగా బురుజులు, రక్షణ గోడలు నిర్మించుకుని నిలబడ్డారని, ఆనాటి రక్త చరిత్రకు సంబంధించిన ఆనవాళ్లు, గుర్తులు నేటికీ మన పల్లెల్లో సజీవంగా కనిపిస్తాయని గుర్తుచేశారు. విమోచన దినోత్సవం ఏ ఒక్కరికో సంబంధించిన కార్యక్రమం కాదని, గతంలో బీఆర్ఎస్ గానీ, ప్రస్తుత కాంగ్రెస్ గానీ మజ్లిస్ పార్టీకి భయపడి అసెంబ్లీలో మాట్లాడిన మాటలను సైతం పక్కనపెట్టి ఈ చారిత్రక దినోత్సవాన్ని నిర్వహించకుండా తప్పించుకున్నాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా భారత ప్రభుత్వమే బాధ్యత తీసుకుని ఈ ఉత్సవాలను నిరంతరాయంగా నిర్వహిస్తోందని చెప్పారు. ఈసారి ఉత్సవాల్లో భాగంగా కేంద్ర సాయుధ దళాల విన్యాసాలతోపాటు తెలంగాణ కళాకారులతో కూడిన ఆకర్షణీయమైన నాట్య ప్రదర్శనలు, సంప్రదాయ డప్పుల విన్యాసాలు చారిత్రక పోరాటాలను కళ్లకు కట్టేలా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉప రాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్, కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తోపాటు పార్లమెంట్ సభ్యులు, ప్రముఖులు అధిక సంఖ్యలో పాల్గొంటారని చెప్పారు. ఈ వేడుకల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# విద్యకు ఎంత ఖర్చయినా వెనుకాడేది లేదు

- ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట
- 19 నుంచి 'రాజీవ్ యువ వికాసం' తొలి విడత సాయం
- ఎస్సీ గురుకులాల్లో కేంద్రీకృత యంత్రాల వంటశాలలు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్, సెప్టెంబర్ 15:**
రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల సంక్షేమం, అభ్యున్నతికే ప్రజా ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని, విద్యారంగ అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఖర్చు చేయడానికి వెనుకాడబోమని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో పేద, బహుజన వర్గాల భవిష్యత్తును తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమంపై ఉన్నతాధికారులతో ఆయన మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ హాజరయ్యారు. సంక్షేమ పథకాల అమలు, గురుకులాల నిర్వహణ, విద్యా మౌలిక వసతులు, స్వయం ఉపాధి, స్కాలర్‌షిప్‌లు, స్టడీ సర్కిళ్లు, తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. తమ ప్రభుత్వం యువతకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని, రాజీవ్ యువ వికాసం పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించామని చెప్పారు. నవంబర్ 19 నుంచి లబ్ధిదారులకు స్వయం ఉపాధి యూనిట్ల కోసం తొలి విడతగా రూ.లక్షవరకు ఆర్థిక సహాయం అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నవంబర్ 19న రాజీవ్ యువ వికాసం యూనిట్ల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని, రూ.లక్షలోపు ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి తొలి విడతలో యూనిట్లు మంజూరు చేయాలని సూచించారు. లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను కార్యాలయాల్లోనే స్వీకరించాలని, ఎంపిక ప్రక్రియను కలెక్టర్ల సమక్షంలో పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. రెసిడెన్షియల్ పాఠశాలల కోసం కేంద్రీకృత యంత్రాల వంటశాలలు ఏర్పాటు చేసే ప్రతిపాదనపై సమావేశంలో చర్చించారు. రాష్ట్రంలోని ఎస్సీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నిత్యం శుభ్రమైన, నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ గురుకుల పాఠశాలల్లో కేంద్రీకృత యంత్రాల వంటశాలలు ఏర్పాటు చేసే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ వంటశాలల నిర్వహణ, యంత్రాల కొనుగోలు కోసం బడ్జెట్‌లో ఇప్పటికే రూ.25 కోట్లను కేటాయించినట్లు గుర్తు చేశారు. ఈ నిధులను సమర్థవంతంగా వినియోగించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రాబోయే 15 రోజుల్లో అన్ని ఎస్సీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో మెకనైజ్డ్ కిచెన్ల ఏర్పాటు ఏ విధంగా పూర్తి చేస్తారనే దానిపై పక్కా కార్యాచరణ, స్పష్టమైన ప్రణాళికతో తమ ముందుకు రావాలని అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. పాఠశాలల్లో ఆధునిక వంటశాలల నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు విద్యార్థుల భోజన వసతికి ఎలాంటి విఘాతం కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. అప్పటివరకు విద్యార్థులందరికీ నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని క్రమం తప్పకుండా సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత బ్రేక్ ఫాస్ట్ పథకం అమలుకు వాడుతున్న కేంద్రీకృత యంత్రాల వంటశాలల నమూనాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, రామంతపూర్ పబ్లిక్ స్కూల్, రాష్ట్రంలోని వివిధ నివాస, సంక్షేమ విద్యాసంస్థల్లో పదేళ్ల నుండి చదువు పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల సమగ్ర డేటాబేస్‌ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. దశాబ్ద కాలంగా ఈ పాఠశాలల్లో విద్యనభ్యసించిన విద్యార్థుల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై ఒక సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. పాఠశాల విద్య పూర్తి చేసుకున్న అనంతరం విద్యార్థులు ఉన్నత చదువుల్లో స్థిరపడ్డారా.. ప్రతిష్టాత్మక ఉద్యోగాలు సాధించారా.. లేక ఆర్థిక, సామాజిక కారణాల వల్ల మధ్యలోనే చదువును ఆపేసి డ్రాపౌట్స్‌గా మిగిలిపోయారా.. ఈ విద్యాసంస్థలు అందించిన విద్య, వసతుల ద్వారా విద్యార్థుల జీవితాల్లో వచ్చిన మార్పులను అంచనా వేయడానికి సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్‌ష(సెస్)తో అధ్యయనం చేయించి డిటైల్డ్ రిపోర్టు తయారు చేయించాలని తెలిపారు.

ఎస్సీ స్టడీ సర్కిళ్లపై చేసిన వ్యయం, ఎంపికైన అభ్యర్థుల సంఖ్య, వారికి అందించిన శిక్షణ, సాధించిన ఫలితాలపై ఆరా తీశారు. స్టడీ సర్కిళ్ల ద్వారా వస్తున్న ఫలితాలు, పెట్టుబడికి అనుగుణంగా వస్తున్న ప్రయోజనాలపై వివరణాత్మక అంచనా నివేదికను సమర్పించాలని ఆదేశించారు. స్టడీ సర్కిళ్లలో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా నాణ్యమైన కోచింగ్ అందించాలని సూచించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 30 డిగ్రీ కళాశాలల్లో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులను ప్రవేశపెట్టే అంశాన్ని అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే ఆయా కోర్సులను స్కిల్ యూనివర్సిటీకి అనుసంధానం చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో 26 ఏకలవ్య పాఠశాలల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపినట్లు అధికారులు ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు అందించేలా పాఠశాలల నిర్మాణం, మౌలిక వసతులపై కూడా చర్చించారు. సమావేశంలో సోషల్ వెల్ఫేర్ సెక్రెటరి విజయేంద్ర బోయి, ట్రైబల్ వెల్ఫేర్ స్పెషల్ సెక్రెటరి సంతోష్, ఎస్సీ కార్పొరేషన్ వైస్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లయ్య బట్టు పాల్గొన్నారు.

# కుల పంచాయితీ పేరుతో అమానుషం

**ఇబ్రహీంపట్నం /కోరుట్ల, సెప్టెంబర్ 15:**
కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామ సమీపంలో తమ సుఖాల కోసం, భవిష్యత్తు కోసం ఇద్దరు వ్యక్తులు తమ తమ కుటుంబాలను, పిల్లలను వదిలేసి వెళ్లారనే తీవ్ర ఆగ్రహంతో వారి ఆచూకీ కనుగొని బలవంతంగా గ్రామానికి రప్పించారు. పోలీసులకు అప్పగించి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన స్వయం ప్రకటిత పెద్దలు చట్టాన్ని పక్కనబెట్టి తామే న్యాయమూర్తుల్లా మారారు. ఊరవతల ఉన్న 'పూదోట మల్లన్న గుట్ట' పరిసర ప్రాంతాల్లో రచ్చబండను ఏర్పాటు చేసి సదరు మహిళపై కుల పంచాయితీ పేరుతో అమానుషంగా ప్రవర్తించినట్లు వెలుగులోకి వచ్చిన ఘటన తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. విచారణ పేరిట బాధితురాలు భయంతో బిగ్గరగా ఏడుస్తున్నా కాళ్లావేళ్లా పడి ప్రాధేయపడుతున్నా అక్కడున్న కుల పెద్దల్లో గానీ, గుమిగూడిన జనాల్లో గానీ రవ్వంత కనికరం కూడా కలగలేదు. మహిళను బలవంతంగా వివస్త్రను చేసి, అత్యంత అమానుషంగా ఆమె జననాంగాల్లో కారంపొడి నింపడమే కాక, తీవ్రమైన మంటను, గాయాన్ని కలిగించే జీడి గింజల రసాన్ని ఆమె మర్మాంగానికి పూసి అమానుషానికి పాల్పడ్డారు. కుల పెద్దల అండ చూసుకుని సాటి కుల సంఘం మహిళలే ఒక బ్యాచ్‌గా ఏర్పడి ఈ దారుణాన్ని అమలు చేయడం, అసభ్యకరమైన పదజాలంతో దూషిస్తూ ఆమెను శారీరకంగా, మానసికంగా చిత్రవధ చేయడం సమాజపు నైతిక పతనానికి పరాకాష్టగా నిలిచింది. ఈ భయానక, అసభ్యకరమైన దృశ్యాలను తమ సెల్‌ఫోన్లలో వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం వారి వికృత చేష్టలకు, అనాగరిక పోకడలకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలో ఓ వృద్ధుడు మహిళ, పురుషుడు ఇద్దరిపై సమానంగా వ్యవహరించాలని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. తప్పు జరిగిందని భావిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, మహిళను మాత్రమే లక్ష్యంగా చేసుకోవడం సరికాదని ఆయన అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్న వీడియోలు, అందుబాటులో ఉన్న ఇతర ఆధారాలను పోలీసులు పరిశీలించి పోలీసులు వాస్తవాలను వెలికి తీయాలి.

# గ్రామీణ యువతకు పరిశ్రమలతో అనుసంధానం

- నిరుద్యోగ పరిష్కారానికి ఇదే చక్కటి మార్గం
- 19న కోదాడలో మెగా జాబ్‌మేళా
- ఎంపికైన అభ్యర్థులకు అక్కడికక్కడే ఆఫర్ లెటర్లు
- ఆఫర్ లెటర్లు అందజేయనున్న పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల
- మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్/సూర్యాపేట, సెప్టెంబర్ 15 :**
గ్రామీణ ప్రాంతాల్లోని విద్యావంతులైన నిరుద్యోగ యువతకు, ప్రముఖ పారిశ్రామిక సంస్థలకు మధ్య బలమైన, నిరంతర అనుసంధానం ఏర్పడాల్సిన అవసరం ఉందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రామీణ యువతలో ప్రతిభకు కొదవ లేకపోయినా సంఘటిత రంగంలోని ఉద్యోగావకాశాలను అందుకునేందుకు సరైన వేదిక లేకపోవడమే ప్రధాన సమస్యగా మారిందన్నారు. ఈ అంతరాన్ని తొలగించేందుకు ప్రభుత్వం వ్యవస్థీకృత కార్యాచరణతో ముందుకు సాగుతోందని చెప్పారు. 19న కోదాడలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా ఏర్పాట్లపై మంగళవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో పాల్గొనే కంపెనీల ప్రతినిధులు, వందకు పైగా విద్యాసంస్థల ప్రతినిధులు, స్థానిక అధికారులను ఉద్దేశించి మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. నిరుద్యోగం సమాజాన్ని వేధిస్తున్న అత్యంత తీవ్రమైన సమస్యల్లో ఒకటని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల యువత పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉందన్నారు. ఇంజినీరింగ్, ఫార్మసీ, పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీతోపాటు వివిధ వృత్తి విద్యాకోర్సులు చదివించేందుకు తల్లిదండ్రులు తమ ఆర్థిక స్థోమతకు మించి ఖర్చు చేస్తున్నప్పటికీ,చదువు పూర్తయ్యాక పిల్లలకు తగిన ఉద్యోగాలు లభించక తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా, టీపీసీసీ అధ్యక్షుడిగా తన సుదీర్ఘ ప్రజాజీవితంలో ఇటువంటి తల్లిదండ్రులను అనేకమందిని కలిశానని చెప్పారు. మునగాల వంటి గ్రామంలో చదివిన ఇంజినీరింగ్ లేదా వృత్తి విద్యా పట్టభద్రుడికి హైదరాబాద్‌లో నివసించే యువకుడితో సమానంగా ప్రముఖ కంపెనీలను సంప్రదించే అవకాశం ఉండదని మంత్రి పేర్కొన్నారు. ఉద్యోగ ఖాళీల వివరాలు తెలుసుకోవడం, పేరొందిన సంస్థలను సంప్రదించడం, పదేపదే హైదరాబాద్‌కు ప్రయాణించడం, ఇంటర్వ్యూలకు హాజరుకావడం గ్రామీణ యువతకు ఆర్థికంగా, సామాజికంగా పెద్ద సవాల్‌గా మారుతోందన్నారు. గ్రామీణ యువత ప్రముఖ కంపెనీల వద్దకు సులభంగా చేరుకోలేకపోతే, ఆ కంపెనీలనే గ్రామీణ యువత ముంగిటకు తీసుకురావాలి. అదే కోదాడ మెగా జాబ్‌మేళా ప్రధాన ఉద్దేశం అని మంత్రి స్పష్టం చేశారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు, విద్యాసంస్థలు అందిస్తున్న అర్హతలు, యువతలో ఉన్న ప్రతిభ...ఈ మూడింటినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చే ప్రయత్నమని తెలిపారు. ఒకే ప్రాంగణంలో అనేక సంస్థల ప్రతినిధులను కలిసి తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం గ్రామీణ నిరుద్యోగులకు కల్పించనున్నట్లు చెప్పారు. అభ్యర్థుల విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఒక్కొక్కరికి ఐదు సంస్థల్లో ఇంటర్వ్యూలకు హాజరయ్యే అవకాశం కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గత ఏడాది హుజూర్‌నగర్‌లో నిర్వహించిన జాబ్‌మేళాలో 200కు పైగా కంపెనీలు పాల్గొనగా ఈసారి కోదాడ జాబ్‌మేళాకు సుమారు 300 కంపెనీలను ఆహ్వానించినట్లు మంత్రి వెల్లడించారు. అపోలో గ్రూప్, జీఎంఆర్, రాంకీ, మహీంద్రా అండ్ మహీంద్రాతోపాటు సిమెంట్, తయారీ, సేవలు, ఐటీ, ఫార్మా, నిర్మాణ, వ్యాపార రంగాలకు చెందిన అనేక ప్రముఖ సంస్థలను సంప్రదిస్తున్నట్లు చెప్పారు. స్థానికంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రతి పరిశ్రమ జాబ్‌మేళాలో పాల్గొనేలా పరిశ్రమల శాఖ అధికారులు వ్యక్తిగతంగా సంప్రదించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం, పరిశ్రమల శాఖ, సింగరేణి సంస్థ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్‌మేళా ద్వారా 3,500 మందికి పైగా యువతకు ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని మంత్రి చెప్పారు. ఇంటర్వ్యూలలో ఎంపికైన అభ్యర్థులకు సాధ్యమైనంత వరకు జాబ్‌మేళా ప్రాంగణంలోనే ఆఫర్ లెటర్లు అందించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై ఆఫర్ లెటర్లు అందజేస్తారని వెల్లడించారు. జాబ్‌మేళాపై ఇప్పటికే సుమారు లక్షన్నర మంది ఉద్యోగార్థులకు బల్క్ సందేశాలు పంపించినట్లు అధికారులు మంత్రికి వివరించారు. అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేస్తున్న క్యూఆర్ కోడ్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. పత్రికా ప్రకటనలు, కరపత్రాలు, పోస్టర్లు, సామాజిక మాధ్యమాల ద్వారా క్యూఆర్ కోడ్‌ను గ్రామస్థాయి వరకు చేరవేస్తున్నట్లు తెలిపారు.

# తెలుగు రాష్ట్రాలకు 5 లక్షల ఇళ్లు

**అమరావతి, సెప్టెంబరు 15:**
సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ఊరటనిచ్చింది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు కలిపి 5 లక్షల ఇళ్లు కేటాయించినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, జలశక్తి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఇందులో ఏపీకి 3 లక్షలు, తెలంగాణకు 2 లక్షల ఇళ్లు మంజూరైనట్లు వెల్లడించారు.

**దేశవ్యాప్తంగా 2 కోట్ల ఇళ్లు**
ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద దేశవ్యాప్తంగా 2 కోట్ల ఇళ్లను కేటాయిస్తున్నామని పెమ్మసాని తెలిపారు. 2024లో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గతంలో మంజూరైన ఇళ్లకు అదనంగా మరిన్ని ఇళ్లు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఏపీకి అదనంగా 2.25 లక్షలు, తెలంగాణకు 1.25 లక్షల ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**'ఆవాస్ ప్లస్'తో లబ్ధిదారుల ఎంపిక**
అర్హులైన కుటుంబాలను గుర్తించేందుకు 'ఆవాస్ ప్లస్' మొబైల్ యాప్‌ను వినియోగించనున్నట్లు పెమ్మసాని తెలిపారు. ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి అర్హత ఉన్న కుటుంబాలకు అన్యాయం జరగకుండా చూస్తామని చెప్పారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి కేంద్రం నుంచి ప్రాథమికంగా రూ.1.20 లక్షలు, అదనంగా రూ.1.80 లక్షల వరకు ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. మరుగుదొడ్డి నిర్మాణానికి మరో రూ.12 వేల సాయం ఉంటుందని వెల్లడించారు.

**గత ప్రభుత్వంపై విమర్శలు**
వైసీపీ ప్రభుత్వ హయాంలో కేటాయించిన ఇళ్ల నిర్మాణం ఆశించిన స్థాయిలో జరగలేదని పెమ్మసాని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కేంద్రం 1.75 లక్షల ఇళ్లు కేటాయిస్తే 42 వేల ఇళ్లు మాత్రమే నిర్మించారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ ఏడాది మరిన్ని ఇళ్లు కేటాయించాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. కొత్తగా మంజూరైన ఇళ్లతో పాటు నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను రాబోయే 2-3 ఏళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

## దసరా నుంచి కొత్త
# పింఛన్ల పంపిణీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 15:**
కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నవారికి శుభవార్త. కొత్త పింఛన్ల పంపిణీకి రేవంత్ సర్కార్ ముహూర్తం ఖారారు చేసింది. దసరా కానుకగా కొత్త పింఛన్లను అందించనుంది. కొత్తగా రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల నూతన పింఛన్లను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అర్హుల నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించింది. లక్షల మంది దరఖాస్తులు చేసుకోగా వీరిలో అర్హులను ఎంపిక చేయాల్సి ఉంది. దరఖాస్తు చేసుకున్నవారి ఇంటికి అధికారులు నేరుగా వెళ్లనున్నారు. వారికి నిజంగా అర్హత ఉందా.. లేదా అనే వివరాలు పరిశీలించనున్నారు. ఈ నెలాఖరు వరకు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అనంతరం వచ్చే నెల తొలి వారంలో అర్హులను ఎంపిక చేసి జాబితా సిద్ధం చేయనున్నారు. అర్హులైన వారికి దసరా నుంచి పింఛన్ సొమ్ము పంపిణీకి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే ఇందుకు అవసరమైన బడ్జెట్ కూడా కేటాయించారు. దీంతో అర్హులను ఎంపిక చేయడమే తరువాయి. ఈ నెలలోనే పరిశీలన పూర్తి చేసి పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వం భావించింది. అయితే క్షేత్రస్థాయి పరిశీలనలో జాప్యం, సర్టిఫికేట్ల జారీలో సమస్యలు తలెత్తడంతో ఆలస్యమైంది. ఆగస్ట్ 9 నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుండగా ఈనెల 15వ తేదీ వరకు గడువు పొడిగించింది. అయితే దివ్యాంగులు, డయాలసిస్, ఫైలేరియా, చేనేత, గీత కార్మికులు, వితంతువులు, ఒంటరి మహిళల అర్హతలను నిర్ధారించేందుకు పత్రాలు అవసరం. ఒంటరి మహిళలకు సంబంధించి విడాకుల డాక్యుమెంట్స్, కోర్టు ఉత్తర్వులతోపాటు ఏడాదిగా ఒంటరిగా ఉంటున్నట్లు ధ్రువీకరణ అవసరమవుతుంది. అలాగే వితంతువులు భర్త డెత్ సర్టిఫికెట్ సమర్పించాలి. అయితే భర్త చనిపోయి ఎక్కువకాలం అయితే సర్టిఫికెట్ పొందటంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇక గీత, చేనేత, ఫైలిరియా, డయాలసిస్ వర్గాలకు సంబంధించి సంబంధిత శాఖల నుంచి ధ్రువీకరణ పత్రాలు పొందటంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో వాటి అవసరం లేకుండానే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఆ తర్వాత ధ్రువీకరణ సమయంలో పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. అప్పుడే పింఛన్లకు అర్హత సాధిస్తారు. అధికారులో క్షేత్రస్థాయిలో పర్యటించి కుటుంబ పరిస్థితి, ఆదాయం, ఇతర ఆధారాలను పరిశీలించనున్నారు. అనంతరం తుది జాబితా సిద్ధం చేయనున్నారు. ప్రస్తుతం 2.50 లక్షల పింఛన్లకు మాత్రమే ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో అంతమంది అర్హులను మాత్రమే ప్రస్తుతం ఎంపిక చేయనున్నారు. ప్రాధాన్యత వారీగా పూర్తి అర్హతలు ఉన్నవారిని ఎంపిక చేయనున్నారు. దసరా నుంచి కొత్త ఫించన్లను అందనుడటంతో అర్హులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పంతాలకు పోవద్దు..
# పదోన్నతులు కోల్పోవద్దు

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 :**
పంతాలకు పోయి పదోన్నతులు కోల్పోవద్దని 1991, 1995, 1996 బ్యాచ్‌ల డీఎస్పీలకు డీజీపీ సి.వి.ఆనంద్ సూచించారు. పదోన్నతుల విషయంలో నెలకొన్న సమస్యను పరిష్కరించేందుకు తాను చొరవ తీసుకుంటానని, అవసరమైతే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయా బ్యాచ్‌లకు చెందిన డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా 37మందికి పదోన్నతులు రావాల్సి ఉంది. అయితే కొందరు అధికారులు కోర్టులను ఆశ్రయించడంతో పదోన్నతుల ప్రక్రియ పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో డీజీపీ చొరవ తీసుకుని తన కార్యాలయంలో ఆయా బ్యాచ్‌ల అధికారులతో సమావేశమయ్యారు. కేసుల విషయంలో నిర్ణయం తీసుకునేందుకు వారం రోజుల సమయం ఇచ్చారు. కోర్టు కేసుల కారణంగా పదోన్నతుల ప్రక్రియకు ఆటంకం ఏర్పడుతోందని డీజీపీ తెలిపారు. 'కేసులు వేసుకుని నష్టపోవద్దు.. మీ సమస్య పరిష్కారానికి నేను ముందుంటా.. అందరూ సహకరిస్తే త్వరగా పదోన్నతులు కల్పించవచ్చు' అని అన్నారు. ప్రస్తుతం ఉన్న 37 అదనపు ఎస్పీ ఖాళీలకు వెంటనే పదోన్నతులు కల్పిస్తామన్నారు.

**కేసుల ఉపసంహరణకు ముందుకు**
డీజీపీతో సమావేశం అనంతరం వరంగల్ జోన్‌కు చెందిన 1991, 1995, 1996 బ్యాచ్‌ల అధికారులు కోర్టులో దాఖలు చేసిన కేసులను ఉపసంహరించుకుంటున్నట్లు డీజీపీ¾కి లేఖ అందించారు. హైదరాబాద్ సిటీకి చెందిన 1991, 1995,1996 బ్యాచ్‌ల అధికారులు కూడా కేసుల ఉపసంహరణకు సుముఖత వ్యక్తం చేశారు. దీంతో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న డీఎస్పీల నుండి అదనపు ఎస్పీలుగా పదోన్నతుల అంశం కొలిక్కి వచ్చే అవకాశం ఏర్పడింది. డీజీపీ ఆనంద్ చొరవతో సమస్య పరిష్కారం దిశగా కదలిక రావడంపై అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

# మహిళా సంఘాలను ఏకీకృతం చేస్తున్నాం

- మహిళా సంక్షేమ శాఖల మంత్రి సీతక్క

**నిజామాబాద్, సెప్టెంబర్ 15 :**
కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనను దిగ్విజయంగా పూర్తి చేసుకుందని, సంక్షేమం, అభివృద్ధి మంత్రంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలో మంగళవారం జరిగిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ గత బీఆరఎస్ ప్రభుత్వం మహిళా సంఘాలను నిర్వీర్యం చేస్తే ప్రజా ప్రభుత్వం మహిళా సంఘాలను ఏకీకృతం చేసి ఆ సంఘాలకు రుణాలపై బీమా, వడ్డీ లేని రుణాలు, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు అందిస్తూ వ్యాపారులుగా మారుస్తున్నదని వివరించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు ఇవ్వడమే కాక సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తున్నదని తెలిపారు. బాల్కొండ నియోజకవర్గంలో మహిళా సంఘాల భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, గ్రామ పంచాయతీ భవనాలు అవసరమైనచోట ఇస్తున్నామని, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.

# కుట్టు మిషన్ పథకం దరఖాస్తులకు గడువు 30

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 :**
బీసీ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించి వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడే ఉద్దేశంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకానికి దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి వెయ్యి చొప్పున మొత్తం 1.19 లక్షల మంది అర్హులైన బీసీ మహిళలకు ఆటోమేటిక్ కుట్టు మిషన్లను 100 శాతం సబ్సిడీపై అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అర్హులైన బీసీ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని 30లోగా టీజీవోబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బీసీ మహిళలకు ఇంటి నుంచే స్వయం ఉపాధి పొందే అవకాశాలను కల్పించడం, తద్వారా వారి కుటుంబాల ఆదాయాన్ని పెంపొందించి ఆర్థికంగా స్వావలంబన సాధించేలా చేయడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు. పథకానికి సంబంధించిన సమాచారం అర్హులైన ప్రతి మహిళకు చేరేలా విస్తృత ప్రచారం నిర్వహించి, అర్హులైన వారందరూ గడువులోగా దరఖాస్తు చేసుకునేలా అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి సమీక్షా సమావేశంలో అధికారులను ఆదేశించారు.

# గణపయ్య చెంతకు నేతలు.. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



- **రామచంద్రాపురం, భారతీనగర్ డివిజన్లలో పలు మండపాల సందర్శన**

**రామచంద్రాపురం, సెప్టెంబర్ 15 (సిరి న్యూస్):**

గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రామచంద్రాపురం, భారతీనగర్ డివిజన్లలో ఏర్పాటు చేసిన పలు గణేష్ మండపాలను మాజీ ప్రొటెం చైర్మన్ భూపాల్ రెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య సందర్శించారు. ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజల శ్రేయస్సును ఆకాంక్షించారు. ఓల్డ్ రామచంద్రాపురం, రామచంద్ర రెడ్డి నగర్ కాలనీ, అశోక్ నగర్ ప్రాంతాల్లోని మండపాలను వారు సందర్శించారు. అనంతరం ఆదర్శ్ రెడ్డి భారతీనగర్ డివిజన్‌లోని ఎల్‌ఐజీ కాలనీ, ఓల్డ్ ఎంఐజీ కాలనీ, ఎంఎసీ సొసైటీలో ఏర్పాటు చేసిన మండపాల్లో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమార్ గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లోపలి కోట హనుమాన్ మందిరంలో గణేష్నుకి పూజలు



**సదాశివపేట. సెప్టెంబర్ 15. (సిరిన్యూస్)**

వినాయక చవితి సందర్భంగా లోపలి కోట హనుమాన్ మందిరంలో ఆలయ కమిటీ చైర్మన్ నాగారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో 18 వ వార్డు కౌన్సిలర్ బిట్ల నికిత ప్రేమ్ కుమార్ గణేషను కి మొదటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మందిరంలో భజన భక్తబృందంచే భక్తి పాటలతో, గణేషన్ కి పూజలు, మంగళ హారతి చేపట్టడం జరిగింది.
ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి చంద్రశేఖర్ స్వామి, సింధోల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భజన భక్తబృందం గాజుల అశోక్, ఏకానంద్, శ్రీరామ్ శ్రీనివాస్, మల్లేశం నాగారం పెంటయ్య అంబదాస్, మునిపల్లి మనోహర్, గున్నాల సత్యం, సోలాపూర్ నర్సింలు, పద్మ గణేష్, ప్రవీణ్ కుమార్, కోట రాజేష్, చందు, జైరామ్ మనోహర్, బాలరాజ్, సోలాపూర్ నవీన్ కుమార్, సోలాపురం విషు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మద్ది శ్రీనివాస్ రెడ్డికి మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్‌గా బాధ్యతలు



**సదాశివపేట. సెప్టెంబర్ 15 (సిరిన్యూస్)**

తెలంగాణ రక్షణ సేన మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్‌గా సంగారెడ్డి మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ మద్ది శ్రీనివాస్ రెడ్డి నియామకమైన సందర్భంగా మంగళవారం సదాశివపేట మండలం వెంకటాపురంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అర్చన నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సంక్షేమంగా ఉండాలని ప్రార్థించారు. అనంతరం మద్ది శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో టిఆర్ఎస్ పార్టీని గ్రామ గ్రామాన విస్తరిస్తామని తెలిపారు. ప్రతి గ్రామంలో పాంచజన్య సభలు నిర్వహించి పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్తామని అన్నారు. తనకు మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్‌గా అవకాశం కల్పించిన పార్టీ అధ్యక్షురాలు కవితమ్మకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**వేణుమాధవ్ ఆధ్వర్యంలో సన్మానం.**

మద్ది శ్రీనివాస్ రెడ్డిని మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్‌గా నియమించిన సందర్భంగా టిఆర్ఎస్ జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ వేణుమాధవ్, రాష్ట్ర నాయకులు శంకర్ నాయక్ కలిసి శ్రీనివాస్ రెడ్డిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్దనూరు ఉప సర్పంచ్ పరమేశ్వర్, బస్వరాజు, నర్సిములు, బెస్త రాము, శ్రీనివాస్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.



# మెదక్ జిల్లా కేంద్రంలో మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు..







- **అవసరమైతే మరిన్ని సిద్ధం**
- **ఉత్సవాల వేళ విద్యుత్ అంతరాయం లేకుండా అధికారుల ముందస్తు చర్యలు**

**మెదక్, సెప్టెంబరు 15 సిరి న్యూస్**

వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం తలెత్తకుండా విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. పండుగ సందర్భంగా మెదక్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేయడంతో పాటు రాత్రివేళల్లో విద్యుత్ వినియోగం పెరిగే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇందులో భాగంగా సోమవారం నాడు మెదక్ జిల్లా కేంద్రంలో మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక భారం పడటం, సాంకేతిక సమస్యలు తలెత్తడం లేదా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే ప్రత్యామ్నాయంగా మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వినియోగించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండపాల వద్ద విద్యుత్ దీపాలంకరణ, సౌండ్ సిస్టమ్స్, ఇతర విద్యుత్ పరికరాల వినియోగం పెరగడంతో సాధారణ రోజులతో పోలిస్తే విద్యుత్ డిమాండ్ అధికంగా ఉండే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని అధికారులు ముందుగానే మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. అవసరాన్ని బట్టి పట్టణంలోని ఏ ప్రాంతంలోనైనా విద్యుత్ సమస్య తలెత్తిన వెంటనే అక్కడికి తరలించి సరఫరాను పునరుద్ధరించేలా చర్యలు చేపడతారు ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏడీఈ మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో సమస్య తలెత్తిన ప్రాంతాలను గుర్తించి తక్షణమే పరిష్కరించేందుకు సిబ్బందిని అప్రమత్తంగా ఉంచుతున్నామని చెప్పారు. అవసరం ఏర్పడితే మరిన్ని మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లను కూడా ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. పండుగ రోజుల్లో విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నందున ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. అత్యవసర పరిస్థితుల్లో ఆలస్యం లేకుండా స్పందించేందుకు క్షేత్రస్థాయి సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. వినాయక మండపాల నిర్వాహకులు కూడా విద్యుత్ పరికరాల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, విద్యుత్ లైన్లకు సమీపంలో ప్రమాదకరంగా అలంకరణలు ఏర్పాటు చేయకుండా నిబంధనలు పాటించాలని అధికారులు సూచించారు. వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా, నిరంతర విద్యుత్ సరఫరాతో సాగేందుకు శాఖ తరఫున అన్ని ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. ఏదైనా ప్రాంతంలో విద్యుత్ సమస్య ఏర్పడిన వెంటనే శాఖ సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులో ఉండటంతో అత్యవసర సమయంలో విద్యుత్ సరఫరాను త్వరగా పునరుద్ధరించే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.

# డిజిటల్ పంటల సర్వేకు రైతులు సహకరించాలి





- **పంటల నమోదు తప్పనిసరి.. నమోదు కాని పంటల విక్రయాల్లో భవిష్యత్తులో ఇబ్బందులు**

**గుమ్మడిదల, సెప్టెంబర్ 15 (సిరి న్యూస్):**

మండలంలో కొనసాగుతున్న ప్రస్తుత వానాకాలం పంటల సాగుకు సంబంధించిన డిజిటల్ పంటల సర్వేకు రైతులు సహకరించాలని మండల వ్యవసాయ అధికారి డి. శ్రీనివాసరావు కోరారు. రైతులు సాగు చేస్తున్న పంటలను తప్పనిసరిగా పంటల సర్వేలో నమోదు చేసుకోవాలని సూచించారు. మండల వ్యాప్తంగా ప్రస్తుత వానాకాలంలో సుమారు 5 వేల ఎకరాల్లో వరి, 1,200 ఎకరాల్లో మొక్కజొన్న, 700 ఎకరాల్లో కంది, 450 ఎకరాల్లో కూరగాయలు సాగవుతున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. రైతులు సాగు చేస్తున్న ప్రతి పంట వివరాలను పంటల సర్వేలో నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పంటల వివరాలు నమోదు చేసుకోకపోతే భవిష్యత్తులో వరి ధాన్యం, మొక్కజొన్న, కంది, పత్తి తదితర పంటల విక్రయాల సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రైతుల సౌకర్యార్థం ప్రతి గ్రామానికి ఒక పంటల సర్వే స్వచ్ఛంద కార్యకర్తను నియమించినట్లు వెల్లడించారు.

**తప్పులు ఉంటే 72 గంటల్లో సరిచేసుకోవాలి**

పంట నమోదు పూర్తయిన వెంటనే సంబంధిత రైతు మొబైల్ ఫోన్‌కు సందేశం వస్తుందని అధికారులు తెలిపారు. నమోదు చేసిన వివరాల్లో ఏదైనా తప్పు ఉన్నట్లయితే రైతులు తమ గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారిని 72 గంటల్లోపు సంప్రదించి వివరాలను సరిచేసుకోవచ్చని సూచించారు. మంగళవారం కొత్తపల్లి, గుమ్మడిదల గ్రామాల్లో జరుగుతున్న డిజిటల్ పంటల సర్వేను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఎం. సుమిత, కె. వందన, పంటల సర్వే స్వచ్ఛంద కార్యకర్తలు రేవతి, జగన్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు. పంటల నమోదు ప్రక్రియను రైతులు సద్వినియోగం చేసుకుని సకాలంలో తమ పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి డి. శ్రీనివాసరావు కోరారు.

# గ్రామాల అభివృద్ధి కి నిరంతర కృషి



- **ఎం ఎల్ ఏ పి.సంజీవ రెడ్డి**
- **జమున నాయక్ తండాలో రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన**

**పెద్ద శంకరం పేట, సెప్టెంబర్ 15, (సిరి న్యూస్):**

గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నామని నారాయణఖేడ్ ఎం ఎల్ ఏ పీ సంజీవ రెడ్డి అన్నారు. మంగళ వారం నాడు ఆయన పెద్ద శంకరంపేట మండల పరిధిలోని జమున నాయక్ తండాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGNREGS) నిధులు రూ.20 లక్షలతో నిర్మించనున్న నూతనంగా నిర్మించనున్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. గ్రామ పంచాయతీ భవనం నిర్మాణంతో స్థానిక ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందుబాటు లోకి వస్తాయని తెలిపారు. తండాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. అనంతరం జమున నాయక్ తండాకు చెందిన లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డి పాల్గొని, నూతన గృహాల్లోకి ప్రవేశించిన కుటుంబాలను అభినందించారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని ఆయన అన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం మరియు ఇతర సదుపాయాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామాల అభివృద్ధితో పాటు తండాల్లో నివసించే ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరచడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సర్పంచ్లు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు, తండా ప్రజలు పాల్గొన్నారు.

# గొంతులో ఇనుప మేకు.. హైటెన్షన్!..

- **భోజనంలో ఇనుప మేకు మింగిన 56 ఏళ్ల మహిళ..**
- *** గొంతులో ఇరుక్కోవడంతో తీవ్ర అస్వస్థత..**
- **చాకచక్యంగా తొలగించిన డాక్టర్ నవీన్ ఆడెపు..**



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 (సిరి న్యూస్)**

భోజనం చేస్తుండగా అనుకోకుండా ఇనుప మేకు మింగిన 56 ఏళ్ల మహిళ, గొంతులో ఇరుక్కుపోవడంతో తీవ్ర అస్వస్థత వెంటనే స్పందించిన కాకతీయ జీర్ణకోశ, కాలేయ ఆసుపత్రి వైద్యులు, అత్యంత చాకచక్యంగా మేకును తొలగించి మహిళకు ఉపశమనం! ఈ ఘటన మంచిర్యాలలో చోటుచేసుకుంది. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం గుండాయిపేటకు చెందిన 56 ఏళ్ల మహిళ సోమవారం రాత్రి భోజనం చేస్తుండగా అనుకోకుండా ఇనుప మేకు మింగింది. అది గొంతులో ఇరుక్కుపోవడంతో తీవ్ర ఇబ్బందికి గురైంది. కుటుంబ సభ్యులు హుటాహుటిన మంచిర్యాలలోని కాకతీయ జీర్ణకోశ, కాలేయ ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యుడు డాక్టర్ నవీన్ ఆడెపు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి పరిస్థితిని గుర్తించారు. అనంతరం ప్రత్యేక వైద్య విధానంతో గొంతులో ఇరుక్కున్న ఇనుప మేకును అత్యంత చాకచక్యంగా తొలగించారు. దీంతో ప్రమాదకర పరిస్థితి నుంచి మహిళ బయటపడటంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. సకాలంలో స్పందించి వైద్యం అందించిన డాక్టర్ నవీన్ ఆడెపుకు మహిళ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.







# సొంత గూడు కోసం..
# కన్నీటి గోడు!..

- చిన్నతనంలోనే తల్లిదండ్రుల మృతి..
- పేదరికంలోనే సాగుతున్న జీవితం..
- ఇందిరమ్మ ఇంటిపైనే సాయికిరణ్ ఆశలు..
- సొంతింటి కోసం ఆర్తనాదం.. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు..
- నా జీవితంలో ఒక్కరోజైనా వెలుగు రావాలి అంటున్న సాయికిరణ్..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 (సిరి న్యూస్)**

జీవితం ఎన్ని కష్టాలు విసిరినా ఎదురొడ్డి నిలబడిన ఒక నిరుపేద యువకుడి కన్నీటి కథ ఇది. మంచిర్యాల జిల్లా, నెన్నెల మండలం, బొప్పారం గ్రామానికి చెందిన రామడుగు సాయికిరణ్ జీవితం ఎన్నో ఒడిదుడుకులను దాటుకుంటూ సాగింది. అతని పోరాటం విన్నవారెవరైనా కంటతడి పెట్టకుండా ఉండలేరు..

**చిన్నతనంలోనే కన్నీటి కథ మొదలైంది..**

2016లో తండ్రిని కోల్పోయిన సాయికిరణ్‌కు, కుటుంబ భారాన్ని మోస్తూ తల్లే అండగా నిలిచింది. కానీ విధి మరోసారి కర్కశంగా వ్యవహరించింది, 2021లో తల్లి కూడా కన్నుమూసింది. ఒక్కసారిగా అనాథలైన సాయికిరణ్, అతని అక్క, అమ్మమ్మ తాతయ్యల చాటున పెరగాల్సిన దుస్థితి ఏర్పడింది..



**ఇప్పుడు అమ్మమ్మ, తాతయ్యలకే అండగా సాయికిరణ్..**

వృద్ధ దంపతులు తనను, అక్కను ఆదుకున్న రుణం తీర్చుకునేలా, ఇప్పుడు సాయికిరణే వారికి అండగా నిలిచాడు. వయసులో చిన్నవాడే అయినా, తండ్రిగా, తల్లిగా బాధ్యత తీసుకున్నాడు. చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా, అప్పులు చేసి మరీ అక్క వివాహాన్ని ఘనంగా జరిపించాడు. ఇంటిల్లిపాదికి అండగా నిలబడాల్సిన వయసులోనే, వృద్ధులైన అమ్మమ్మ, తాతయ్యల బాధ్యతను, కుటుంబ బరువును తన భుజాలపై మోస్తున్నాడు ఈ యువకుడు..

**పెళ్లి చేసుకుందామన్నా.. అడ్డుగా నిలు-స్తున్న పేదరికం..**

పెళ్లి చేసుకోవాలంటే కనీసం మంచి ఉద్యోగం, మంచి జీతం ఉండాలి, లేదంటే ఆస్తులైనా ఉండాలి. కానీ సాయికిరణ్‌కు ఇవేవీ లేవు. కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న అతడికి, కనీసం తలదాచుకోవడానికి సొంతిల్లు కూడా లేకపోవడంతో పెళ్లి ఆలోచనే భారంగా మారింది..

**కాలం మారుతుంది..కానీ నా జీవితం మారలేదు, కన్నీటి ఆవేదన..**

తన జీవితాన్ని తలచుకుంటూ సాయికిరణ్ కన్నీటి పర్యంతమవుతూ ఇలా అంటున్నాడు..కాలం మారుతుంది కానీ నా జీవితం మారలేదు. ఎప్పటివరకు ఈ పేదరికం? అయినా ఒక్కరోజైనా నా జీవితంలో వెలుగు వస్తుందని ఒక ఆశ. ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే, స్థానిక ప్రజాప్రతినిధులు నా గూడు గురించి విన్నవించి, సొంత ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తే నా జీవితంలో ఒక మంచి వెలుగు వెలుగుతుందని ఆశిస్తున్నాను అని ఆవేదన వ్యక్తం చేశాడు. ఎన్నో ఏళ్లుగా కష్టాలతో కుంగిపోతున్న ఈ యువకుడి మాటలు వినేవారి హృదయాలను కదిలిస్తున్నాయి..

**అద్దె ఇళ్ల మధ్య కొట్టుమిట్టాడుతున్న జీవితం..**

నేటికీ సొంతిల్లు లేకపోవడంతో అతడి కుటుంబం అష్టకష్టాలు పడుతోంది. అద్దె ఇళ్లు, తాత్కాలిక గూళ్ల మధ్య అతడి జీవితం కొట్టుమిట్టాడుతోంది. వృద్ధులైన అమ్మమ్మ, తాతయ్యలను చూసుకుంటూ, సొంత జీవితాన్ని కూడా నిలబెట్టుకోవాలంటే ఒక్క సొంతిల్లు కావాలని అతడు తపిస్తున్నాడు..

**ఇందిరమ్మ ఇల్లు కోసం ఎదురుచూపులు..**

నిరుపేద కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో తనకు న్యాయం చేయాలని సాయికిరణ్ గోడు వెళ్లబోసుకుంటున్నాడు. బొప్పారం గ్రామస్తులు సైతం అతని కుటుంబ దయనీయ స్థితిని కళ్లారా చూసి, వెంటనే ఇల్లు మంజూరు చేయాలని అధికారులను వేడుకుంటున్నారు..

**ఇది కేవలం ఒక వార్త కాదు.. నాయకుల నిజాయితీకి పరీక్ష!..**

ఎన్నికల వేళ వేదికలెక్కి పేదల పక్షాన నిలుస్తాం, ఏ ఒక్కరినీ నిరాశపరచం అని ఊదరగొట్టే ప్రసంగాలు చేసే నేతలు, అసెంబ్లీ సాక్షిగా పేదల సంక్షేమ నినాదాలు అందుకునే ప్రజాప్రతినిధులు, ఇప్పుడు నిజంగా పరీక్షకు గురవుతున్నారు. వృద్ధులైన అమ్మమ్మ, తాతయ్యలకు అండగా నిలిచి, అక్కకు తండ్రిలా బాధ్యత నెరవేర్చి, సొంత జీవితాన్ని కూడా త్యాగం చేస్తున్న సాయికిరణ్ లాంటి యువకుడి కన్నీటి ఆశను నెరవేర్చలేని పాలన ఎలాంటిదో అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు..

**ప్రజల డిమాండ్:** స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే ఈ కుటుంబాన్ని పరామర్శించి, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేలా చొరవ తీసుకోవాలని గ్రామస్తులు, సామాజిక కార్యకర్తలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.. ఒక్కరోజైనా ఈ యువకుడి జీవితంలో వెలుగు రావాలి అని ఆశిస్తున్న గ్రామస్తులు.. ఈ యువకుడికి ఒక్క గూడు ఇస్తే చాలు, అదే అతని జీవితాన్ని మార్చేస్తుంది. ప్రభుత్వం ఎప్పుడు స్పందిస్తుందో వేచి చూడాలి.

# గణనాథుడి నిమజ్జన పూలకు పునర్జన్మ

- పూల వ్యర్థాలు ఇక అగరబత్తీలు ధూపాలు దీపాలు
- సైబరాబాద్‌లో సుస్థిర గణేశ ఉత్సవాలకు కొత్త అధ్యాయం

**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 15 (సిరి న్యూస్):**

గణేశునికి సమర్పించిన పూలు నిమజ్జనం తర్వాత చెత్తగా మారకుండా అగరబత్తీలు, ధూపాలు, దీపాలుగా మారేలా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కొత్త ప్రయోగం చేపట్టనుంది. పండుగ అనంతరం పేరుకుపోయే పూల వ్యర్థాలను సర్క్యులర్ ఎకానమీ పద్ధతిలో వినియోగించేందుకు పక్కా ఆర్గానిక్స్ సంస్థతో సీఎంసీ సమావేశం నిర్వహించింది.ప్రతి ఏటా వినాయక చవితి సందర్భంగా లక్షలాది పూలు, మాలలు నిమజ్జన కేంద్రాల వద్ద పేరుకుపోతాయి. వీటిని సాధారణ చెత్తతో కలిపేస్తే సరస్సులు మురికి అవుతాయి. ఈసారి అలా కాకుండా పూలను వేరుగా సేకరించి ఎండబెట్టి, విలువైన ఉత్పత్తులుగా మార్చాలని సీఎంసీ యోచిస్తోంది.

**తొలుత ఐడీఎల్ సరస్సు వద్దే...**

సీఎంసీ పరిధిలోని నిమజ్జన కేంద్రాల్లో ప్రత్యేక పూల సేకరణ కియోస్క్‌లు ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదించారు. తొలిదశలో కూకట్‌పల్లి జోన్‌లోని ఐడీఎల్ సరస్సు వద్ద ఈ వ్యవస్థను ప్రారంభించనున్నారు. అక్కడ సేకరించిన పూలను వేరు చేసి ఎండబెట్టిన తర్వాత అగరబత్తీలు, ధూపాలు, దీపాలుగా ప్రాసెస్ చేస్తారు.కమిషనర్ జి. శ్రీజన నేతృత్వంలో జరిగిన సమావేశంలో పూల వ్యర్థాల నుంచి ఉత్పత్తుల తయారీ, ప్రాసెసింగ్ టెక్నాలజీ, సేకరణ విధానంపై చర్చ జరిగింది. భక్తులు సమర్పించిన పూలకు నిమజ్జనం తర్వాత కూడా మరో ప్రయోజనం ఉండాలన్నది సీఎంసీ ఉద్దేశం.

**స్టార్టప్‌లు,ఎన్‌జీఓలకు ఆహ్వానం..**

పూల వ్యర్థాల నిర్వహణ, వ్యర్థాల నుంచి విలువ సృష్టి, సర్క్యులర్ ఎకానమీలో అనుభవం ఉన్న ఎన్‌జీఓలు, స్టార్టప్‌లు, ఇతర సంస్థలు ముందుకు రావాలని సీఎంసీ పిలుపునిచ్చింది. వారి సాంకేతిక పరిజ్ఞానం, ప్రాసెసింగ్ సామర్థ్యంతో ఈ



కార్యక్రమాన్ని సైబరాబాద్ వ్యాప్తంగా విస్తరించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.గణేశ్ ఉత్సవాల్లో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు, పూలు, మాలలు సరస్సుల్లో కలవడం వల్ల నీటి కాలుష్యం పెరుగుతోందని పర్యావరణవేత్తలు ఏటా హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మట్టి విగ్రహాల పంపిణీతో పాటు పూల వ్యర్థాలను కూడా శాస్త్రీయంగా నిర్వహించాలని సీఎంసీ నిర్ణయించింది.

**చెత్త కాదు.. వనరు..**

పండుగల సమయంలో వ్యర్థాలను తగ్గించడం, సుస్థిర ఉత్సవాలు నిర్వహించడం, వనరులను మళ్లీ వినియోగించడం సీఎంసీ లక్ష్యమని అధికారులు చెప్పారు. భక్తితో సమర్పించిన పూలు సరస్సులో మునిగిపోయి ముగియకుండా, అగరబత్తి రూపంలో మళ్లీ పూజలోకి రావడమే ఈ ప్రయత్నం సారాంశం.ఐడీఎల్ సరస్సు వద్ద తొలి ప్రయోగం విజయవంతమైతే సీఎంసీ పరిధిలోని ఇతర నిమజ్జన కేంద్రాలకు కూడా ఇదే నమూనాను విస్తరించనున్నారు. సేకరణ, ఎండబెట్టడం, ఉత్పత్తి తయారీకి స్థానిక యువత, మహిళా స్వయం సహాయక బృందాలను కూడా అనుసంధానించే అవకాశం ఉందని సమాచారం.



## మండపాలను దర్శించుకున్న నాయకులు

**పటాన్ చెరు, సెప్టెంబర్ 15, (సిరి న్యూస్):**

వినాయక చవితి సందర్భంగా పట్టణం లోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తో పాటు తాజా మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ లు దర్శించుకున్నారు. ప్రజలంతా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారికి వివరించారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరా విషయంలో నిర్వాహకులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వినాయక చవితి పర్వదినం పురస్కరించుకొని.. పటాన్ చెరు, జెపి కాలనీ డివిజన్ల పరిధిలోని వినాయక మండపాలను దర్శించుకుని.. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు . గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ 11 రోజుల పాటు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించాలని కోరారు.

# సిఎంసి కార్యాలయంలో గణనాథుడికి ప్రత్యేక పూజలు



**సైబరాబాద్, సెప్టెంబర్ 15 (సిరి న్యూస్):**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం గణేష్ పూజ ఘనంగా జరిగింది. సిఎంసి కమిషనర్ శ్రీజనతో పాటు అన్ని విభాగాల అధిపతులు, జోనల్, డిప్యూటీ కమిషనర్లు, సిబ్బంది హాజరై గణేశుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా వేదికపై పుష్పాలు, హారతి, మంత్రోచ్చారణతో కార్యాలయం భక్తిమయమైంది. జ్ఞానం, శ్రేయస్సు, సౌభ్రాతృత్వం ప్రసాదించాలని, అభివృద్ధి పనుల్లో ఎదురయ్యే అడ్డంకులు తొలగాలని అందరూ కలిసి ప్రార్థించారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించే దిశగా సీఎంసీ చేపడుతున్న కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు .ఈ కార్యక్రమం కేవలం ఆచారం మాత్రమే కాదని, అధికారులు సిబ్బంది మధ్య ఐక్యత, సామరస్యం, సమిష్టి బాధ్యతను ప్రతిబింబించిందని పాల్గొన్నవారు అన్నారు. సైబరాబాద్‌ను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు విఘ్నరాజు ఆశీస్సులు కావాలని వారు నమ్మకం వ్యక్తం చేశారు.

# భూ భారతి రీసర్వే అభ్యంతరాలపై విచారణ



- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్.

**మెదక్ సెప్టెంబర్,15(సిరి న్యూస్)**

భూ భారతి రీ-సర్వే ప్రక్రియలో భాగంగా మెదక్ మండలం పాశాపూర్ గ్రామంలో అదనపు కలెక్టర్ మంగళవారం (రెవెన్యూ) పరిశీలన నిర్వహించారు. గ్రామంలో రీ-సర్వేకు సంబంధించి రైతులు దాఖలు చేసిన అభ్యంతర పిటిషన్లను పరిశీలించి, వాటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అభ్యంతర పిటిషన్ల పై రైతుల సమక్షంలో క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి, సంబంధిత రికార్డులు, భూముల వివరాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి, రైతులతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను పరిష్కరించి, అభ్యంతర దరఖాస్తులను నిర్ణీత ప్రక్రియ మేరకు త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. భూ భారతి రీ-సర్వే ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారి అభ్యంతరాలను పారదర్శకంగా పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడి ల్యాండ్ సర్వే కిషన్, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# విఘ్నాలను తొలగించి, విజయాలను చేకూర్చాలి



- గణేషనుకి ప్రత్యేక పూజలు చేసిన పిఎంఆర్.

**సదాశివపేట. సెప్టెంబర్ 15. (సిరిన్యూస్)**

పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో వినాయక నవరాత్రులను పురస్కరించుకొని సంగారెడ్డి ఎమ్మెల్యే కాంటెస్టెడ్ అభ్యర్థి పులిమామిడి రాజు తన అనుచరులతో కలిసి వినాయక పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురోహితులు జంగం మహేష్ స్వామి నేతృత్వంలో ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ శ్రీ విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. వినాయక నవరాత్రులు ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించేలా జరుపుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రజలందరికీ విఘ్నాలు తొలగించి, విజయాలు ప్రసాదించాలని శ్రీ గణనాథుడిని ప్రార్థించినట్లు పులిమామిడి రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో చాపల హన్మంతు, ఉషాకిరణ్ యూత్ అధ్యక్షులు బామిని రవికుమార్, అజీమ్, మలాన్, పి.ఎం.ఆర్. యువసేన నాయకులు రాగం అనిల్, గుణాకర్, తాలెల్మ రాము, అఖిల్, సోమ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# కొల్చారం గ్రామంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



- ప్రధాన వీధులు , కాలనీల గుండా మందు పిచికారీ
- గ్రామ సర్పంచ్ దేవన్న గారి * శేఖర్* ఆధ్వర్యంలో

కొల్చారం15 సెప్టెంబర్,(సిరి న్యూస్)

.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కొల్చారం మండల గ్రామంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామ సర్పంచ్ దేవన్న గారి శేఖర్ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన వీధులు, కాలనీలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమల నివారణ మందును పిచికారీ చేశారు. ఈ సందర్భంగా దేవన్నగారి శేఖర్ మాట్లాడ గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దోమల నివారణకు ప్రత్యేక మందును వినియోగిస్తున్నామని తెలిపారు. గ్రామంలో పరిశుభ్రత పాటించడంతో పాటు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోరంపల్లి రాణి గోపి, వార్డు సభ్యులు కృష్ణ చింతల కృష్ణ యాదగిరి డాక్టర్ బాలరాజు ప్రవీణ్ షేకులు వనమాల శ్రీధర్ , గ్రామ ప్రజాప్రతినిధులు మహేశ్వర్ రెడ్డి దేవన్న గారి ప్రశాంత్, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మేధో క్షయంపై గీతంలో చర్చాగోష్ఠి



- వక్తలుగా పాల్గొన్న డాక్టర్ రథిన్ రాయ్, డాక్టర్ సుప్రీ రంజన్, సుర్వేష్ ప్రతాప్ సింగ్

పటాన్ చెరు, సెప్టెంబర్ 15, (సిరి న్యూస్)

'మేధోక్షయం రాజకీయాలను కలిసినప్పుడు: బొద్దింక జనతా పార్టీ కథ' అనే అంశంపై గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్), హైదరాబాదులోని రాజనీతి శాస్త్ర విభాగం సెప్టెంబరు 15న ఆలోచన రేకెత్తించే చర్చా గోష్ఠిని నిర్వహించింది. ప్రముఖ ఆర్థికవేత్త, జీఎస్ హెచ్ఎస్ డీన్ అయిన డాక్టర్ రథిన్ రాయ్ తో పాటు, రాజనీతి శాస్త్ర విభాగంలోని అధ్యాపకులైన డాక్టర్ సుప్రీ రంజన్, సుర్వేష్ ప్రతాప్ సింగ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. యువ తరాలలో మారుతున్న రాజకీయ ఆకాంక్షలు, ఆర్థిక చైతన్యం, సామాజిక ఐక్యత, సాంకేతిక పరివర్తన, నిరసన ఉద్యమాలు, యువత రాజకీయాల మధ్య అభివృద్ధి చెందుతున్న సంబంధం వంటి అంశాలను వక్తలు విశ్లేషించారు. డాక్టర్ రాయ్, శ్రేయస్సు, అసమానతల యొక్క మారుతున్న నమూనాల పై తన అభిప్రాయాలను పంచుకుంటూ, అభివృద్ధి చెందుతున్న రాజకీయ ఉద్యమాలను తీర్చి దిద్దడంలో ప్రతిఘటన, వీధి రాజకీయాలు, సాంకేతికత, యువత ఆకాంక్షల పాత్రను ప్రముఖంగా ప్రస్తావించారు. డాక్టర్ సుప్రీ రంజన్ భారతదేశంలో, ముఖ్యంగా సరళీకరణ అనంతర కాలంలో యువజన ఉద్యమాల పరివర్తన గురించి, అలాగే ప్రతిభ, పరీక్షా పత్రాల లీకులు, వ్యవస్థాగత అసమానతలు వంటి సమస్యల వల్ల ఎదురయ్యే సవాళ్ల గురించి చర్చించారు. సుర్వేష్ ప్రతాప్ సింగ్ సాంస్కృతిక పునరుత్థానం, ఆర్థిక చైతన్యం, ప్రజా ప్రదేశాలు, వీధి స్థాయి భాగస్వామ్యంలో వేళ్లూనుకున్న ఒక ప్రక్రియగా ప్రజాస్వామ్యం అనే భావనపై మాట్లాడారు. విద్యార్థులు, అధ్యాపకులు అడిగిన పలు సందేహాలకు తగ్గ జవాబులిచ్చి వక్తలు ఆకట్టుకున్నారు. డాక్టర్ మయాంక్ మిశ్రా వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది.

# దుర్గం చెరువులో నిమజ్జన ఏర్పాట్లపై ఉన్నతాధికారుల సమీక్ష



- క్రేన్ పాయింట్లు, బారికేడ్లు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ మళ్లింపుల పరిశీలన

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 15 ( సిరి న్యూస్):

వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో మాదాపూర్ పరిధిలోని దుర్గం చెరువు వద్ద చేపట్టిన ఏర్పాట్లను పోలీసు, మున్సిపల్ శాఖల ఉన్నతాధికారులు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, మాదాపూర్ సర్కిల్ 50 డీసీ బాలకృష్ణతో పాటు అదనపు డీసీపీ, మాదాపూర్ ఏసీపీలు, ట్రాఫిక్ ఏసీపీ, శాంతిభద్రతలు, ట్రాఫిక్ విభాగాల అధికారులు దుర్గం చెరువును సందర్శించి నిమజ్జన ఏర్పాట్లపై సమీక్షించారు.చెరువు వద్ద ఏర్పాటు చేసిన క్రేన్ పాయింట్లు, బారికేడ్లు, నియంత్రణ గది, వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, భక్తుల రాకపోకలకు సంబంధించిన మార్గాలు, ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. నిమజ్జనం సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున రద్దీ నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా పోలీసు బందోబస్తును పటిష్ఠం చేయాలని నిర్ణయించారు. విధుల్లో ఉండే సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. పోలీసు, మున్సిపల్, ట్రాఫిక్ విభాగాలు పరస్పర సమన్వయంతో పని చేస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని డీసీపీ రితిరాజ్ సూచించారు.

# నానక్‌రామ్‌గూడ భూ వివాదం.. అల్లు అర్జున్ మామపై ఫిర్యాదు

- సెక్యూరిటీ సిబ్బందిని బెదిరించారంటూ ఆరోపణ

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 15 (సిరి న్యూస్):



నానక్‌రామ్‌గూడలోని మంత్రీ కాస్మోస్ భవన ప్రాంగణంలోకి కొందరు వ్యక్తులు అక్రమంగా ప్రవేశించి టిన్‌షీట్లు ఏర్పాటు చేశారంటూ మంత్రీ కాస్మోస్ ఓనర్స్ అసోసియేషన్ తరఫున పెద్దిరాజు గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో కే. చంద్రశేఖర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, గడ్డం రవి తదితరుల పేర్లను పేర్కొన్నారు. నానక్‌రామ్‌గూడ సర్వే నంబర్ 130లోని మంత్రీ కాస్మోస్ భవనం ఎస్ఈజెడ్‌గా గుర్తింపు పొందిందని, పలు బహుళజాతి సాఫ్ట్‌వేర్ సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని ఫిర్యాదుదారుడు తెలిపారు. ఉదయం సుమారు 8.40 గంటలకు మురళీధర్‌రెడ్డి, గడ్డం రవి నేతృత్వంలోని కొందరు వ్యక్తులు సౌత్‌వెస్ట్ కార్నర్ గేట్ వద్ద తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి, నిర్మాణాలను ధ్వంసం చేసి టిన్‌షీట్లు ఏర్పాటు చేశారని ఆరోపించారు. అడ్డుకున్న సెక్యూరిటీ సిబ్బందిని తోసివేసి బెదిరించినట్లు పేర్కొన్నారు.ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీలో నమోదయ్యాయని,ఫొటోలు,వీడియోలను పెన్‌డ్రైవ్‌లో పోలీసులకు అందజేసినట్లు తెలిపారు. సంబంధిత ప్రాంతం అత్యవసర సమయంలో అగ్నిమాపక వాహనాల రాకపోకలకు ఉపయోగపడుతుందని, ఆక్రమణలతో భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవడంతో పాటు భవనానికి భద్రత కల్పించాలని కోరారు. ఫిర్యాదు ప్రతులను డీజీపీ, సైబరాబాద్ పోలీస్ కమిషనర్, మాదాపూర్ డీసీపీ, గచ్చిబౌలి ఏసీపీలకు పంపినట్లు తెలిపారు.

# చెన్నూర్ పుష్కరాలకు భారీ కసరత్తు..

- రూ.70 కోట్లతో పుష్కరాల అభివృద్ధి పనులు..
- రూ.8 కోట్లతో ఆధునిక స్నాన ఘాట్లు..
- రూ.17 కోట్లతో శివాలయ అభివృద్ధి.. క్రొకోడైల్ పార్క్‌కు ప్రత్యేక ప్రణాళిక..

మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 (సిరి న్యూస్)



గోదావరి పుష్కరాలు, 2027ను దృష్టిలో పెట్టుకుని చెన్నూర్ పుష్కరఘాట్‌ను భారీగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పుష్కరఘాట్ నిర్మాణానికి శక్తి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మంగళవారం శంకుస్థాపన చేశారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఘాట్లు, రహదారులు, మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నట్లు మంత్రి తెలిపారు. రూ.70 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. రూ.8 కోట్లతో ఆధునిక స్నాన ఘాట్లు, రూ.17 కోట్లతో శివాలయ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. క్రొకోడైల్ పార్క్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. 2027 గోదావరి పుష్కరాలకు చెన్నూర్‌కు సుమారు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా అన్ని సౌకర్యాలతో పుష్కరఘాట్‌ను తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం రూ.1,000కోట్ల నిధులు కేటాయించినట్లు వెల్లడించారు.

# యూపీఐ ఛార్జీలపై కేంద్రం క్లారిటీ

- రూ.2 వేల వరకు యూపీఐ చెల్లింపులు ఉచితం
- పీ2పీ లావాదేవీలకు ఎలాంటి రుసుము లేదు
- చెల్లింపుదారు, స్వీకర్తపై ఛార్జీలు వద్దు
- రూపే డెబిట్ కార్డు అర్హత చెల్లింపులకూ మినహాయింపు
- బ్యాంకులు, చెల్లింపు సంస్థలు నిబంధనలు పాటించాల్సిందే

హైదరాబాద్, సెప్టెంబరు 15:

యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధిస్తారన్న ఆందోళనలకు కేంద్ర ప్రభుత్వం తాజా నోటిఫికేషన్‌తో స్పష్టత ఇచ్చినట్లు సమాచారం. రూ.2 వేల వరకు జరిగే నిర్దిష్ట యూపీఐ చెల్లింపులపై చెల్లింపుదారు, చెల్లింపు స్వీకర్త నుంచి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎలాంటి రుసుమూ వసూలు చేయకూడదని బ్యాంకులను ఆదేశించినట్లు తెలుస్తోంది.




**పీ2పీ లావాదేవీలు యథాతథంగా ఉచితం**

ఒక వ్యక్తి మరో వ్యక్తికి యూపీఐ ద్వారా నగదు బదిలీ చేసే పీ2పీ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు విధించకూడదనే విధానం కొనసాగనుంది. వ్యక్తిగత అవసరాల కోసం యూపీఐ వినియోగించే వారికి దీనివల్ల అదనపు భారం ఉండదు.

**రూపే చెల్లింపులకూ మినహాయింపు**

రూపే డెబిట్ కార్డు ద్వారా నిర్వహించే అర్హత కలిగిన చెల్లింపులపైనా ఎలాంటి రుసుము విధించకూడదని తాజా మార్గదర్శకాల్లో పేర్కొన్నట్లు సమాచారం. బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలు ఈ నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంటుంది. దీంతో రోజువారీ కొనుగోళ్లు, సేవల చెల్లింపులు, వ్యక్తిగత నగదు బదిలీలకు యూపీఐపై ఆధారపడే వినియోగదారులకు ఊరట లభించనుంది.

# బొమ్మా బొరుసు ఆడుతున్న ఏడుగురు అరెస్ట్

- రూ.24,510 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం
- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

వెల్దుర్తి, సెప్టెంబర్ 15, (సిరి న్యూస్ ):



వెల్దుర్తి మండలం హక్కింపేట గ్రామ పరిధిలోని హక్కింపేట డ్యామ్ సమీపంలో బొమ్మా బొరుసు ఆడుతున్న ఏడుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు నిర్వహించి జూదం ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో దేవసోత్ దశరథ్, మల్లారెడ్డి నవీన్‌రెడ్డి, ఎండీ హుస్సేన్, దొడ్ల వినోద్, మల్లబోయిన గణేష్, పాశం మాణిక్‌రెడ్డి, గాండ్ల రాజు ఉన్నారు. వారి నుంచి రూ.24,510 నగదు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.జిల్లాలో జూదం, బొమ్మా బొరుసు, బెట్టింగ్ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. జూదం వల్ల కుటుంబాలు ఆర్థికంగా నష్టపోవడంతో పాటు పలు సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. ప్రజలు ఇలాంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్టవిరుద్ధ జూదం, బెట్టింగ్‌కు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్పీ కోరారు.

# పీఎన్‌ఆర్ కాలనీ స్మశాన వాటిక వద్ద సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

- కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించిన మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి
- పాల్గొన్న మాజీ కౌన్సిలర్ కృష్ణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఉపేందర్ రెడ్డి

అమీన్‌పూర్ సెప్టెంబర్ 15: సిరి న్యూస్




అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను ముమ్మరంగా కొనసాగిస్తున్నామని మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని పీఎన్‌ఆర్ కాలనీ పక్కన ఉన్న స్మశాన వాటిక సమీపంలో నూతనంగా మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కృష్ణ,ఉపేందర్ రెడ్డితో కలిసి ఆయన భూమిపూజ నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. పీఎన్‌ఆర్ కాలనీ పరిసర ప్రాంత ప్రజలు, స్మశాన వాటికకు వచ్చే వారు గత కొంతకాలంగా ఎదుర్కొంటున్న రాకపోకల సమస్యను పరిష్కరించేందుకు ఈ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రజల మౌలిక వసతుల కల్పనలో ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా సీసీ రోడ్డు పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత గుత్తేదారులను, అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మరియు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# గీతంలో ఇంజనీర్ల దినోత్సవ వేడుకలు



పటాన్ చెరు, సెప్టెంబర్ 15, (సిరి న్యూస్)

హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సెప్టెంబరు 15న మినీ హ్యాకథాన్, ఆటలు, ఆసక్తికరమైన కార్యక్రమాలతో ఇంజనీర్ల దినోత్సవం 2026ను ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలలో వివిధ విభాగాల ఇంజనీరింగ్ విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. భారత దేశపు అత్యంత ప్రసిద్ధ ఇంజనీర్లలో ఒకరు; నీటిపారుదల, నీటి నిర్వహణ, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక అభివృద్ధి రంగాలలో మార్గదర్శకుడైన సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ప్రతి యేటా సెప్టెంబరు 15న ఇంజనీర్ల దినోత్సవాన్ని పాటిస్తారు. ఈ సందర్భంగా, గీతం నాయకత్వం ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించింది. ఆవిష్కరణలు, సాంకేతికత, సుస్థిర పరిష్కారాల ద్వారా వాస్తవ ప్రపంచ సవాళ్లను పరిష్కరించడంలో ఇంజనీర్ల కీలక పాత్రను ఈ వేడుకలు చాటి చెప్పాయి. ఆవిష్కరణలను సుస్థిరతతో, సాంకేతికతను మానవత్వంతో, నైపుణ్యాన్ని సామాజిక బాధ్యతతో మేలవించే బాధ్యతాయుతమైన ఇంజనీర్లుగా ఎదిగి, సర్ ఎం. విశ్వేశ్వరయ్య వారసత్వాన్ని ముందుకు తీసుకు వెళ్లాలని ఈ కార్యక్రమం విద్యార్థులను ప్రోత్సహించింది. మరింత వినూత్నమైన, సుస్థిరమైన, స్థితిస్థాపకమైన, సమ్మిళిత భారతదేశానికి దోహదపడే పరిష్కారాలను సృష్టించడం కొనసాగించాలని యువ ఇంజనీర్లకు సందేశంతో ఈ కార్యక్రమం ముగిసింది.

# ఉద్యమకారుడికి కన్నీటి వీడ్కోలు!..

- ఉద్యమ సేవలకు ఘన నివాళి..
- రవీందర్ కుటుంబానికి మంత్రి భరోసా..
- రాజకీయాలకు అతీతంగా అండగా ఉంటామని హామీ..

మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 (సిరి న్యూస్)



తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని, భారత రాష్ట్ర సమితి ఆవిర్భావంలో కీలకంగా పనిచేసిన జె.రవీందర్ అకాల మరణం పట్ల రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి సంతాపం వ్యక్తం చేశారు. మంచిర్యాలలోని రవీందర్ కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ముందుగా రవీందర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో జె.రవీందర్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం రవీందర్ ఎంతో నిబద్ధతతో పనిచేశారని తెలిపారు. ఉద్యమ సమయంలో ఆయనతో కలిసి పనిచేసిన రోజులను గుర్తుచేసుకుంటూ, రవీందర్ సేవలను కొనియాడారు. రాజకీయాల్లో రవీందర్ అజాతశత్రువుగా కొనసాగారని, భిన్న రాజకీయ అభిప్రాయాలు ఉన్నప్పటికీ అందరితో స్నేహపూర్వకంగా, హుందాగా మెలిగేవారని మంత్రి తెలిపారు. ఆయన అకాల మరణం ఉద్యమకారులకు, సన్నిహితులకు తీరని లోటు అని పేర్కొన్నారు. రవీందర్ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని, రాజకీయాలకు అతీతంగా కుటుంబ సభ్యులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి భరోసా ఇచ్చారు.

# ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్ పెంచిన ఘనత బిఆర్ఎస్ పార్టీదే

- తాండాలను గ్రామ పంచాయతీలుగా మార్చాం
- కెసిఆర్ రిజర్వేషన్ 6% నుండి 10% పెంచారు
- కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్టీలకు చేసింది ఏమీ లేదు
- ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

నర్సాపూర్ సెప్టెంబర్ 15 (సిరి న్యూస్)



బీ ఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీ ఆర్ఎస్ నాయకులతో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి సమావేశం నిర్వహించారు అనంతరం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వంలో కెసిఆర్ సెప్టెంబర్ 15 నాడు గిరిజనులకు 6 శాతం ఉన్న రిజర్వేషన్ 10% శాతానికి పెంచిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వం అని అన్నారు ఈ రిజర్వేషన్ కల్పించి ఐదు సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా సెప్టెంబర్ 17 న ప్రతి గిరిజన తండాలలో గ్రామ పంచాయతీలో ర్యాలీలు నిర్వహించి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేయాలని పిలుపునిచ్చారు బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఈ రిజర్వేషన్ తో గిరిజనులకు ఉద్యోగాలలో కళాశాలలో విద్యార్థులకు ఎంతో మేలు జరిగిందనీ గిరిజనులు సంతోషపడుతున్నారని తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీది అని కెసిఆర్ ప్రభుత్వంలో

4300 కొత్త గ్రామ పంచాయతీలుగా చేసింది దానిలో 3100 తండాలను గ్రామ పంచాయతీలుగా చేశారు ఎస్ టి ఎస్ డి ఎఫ్ పథకం ద్వారా 13 వేల కోట్ల రూపాయల తండాలకు ఇవ్వడంతో సిసి రోడ్లు డ్రైనేజీలు , తాగునీరు కరెంట్ సమస్యలు లేకుండా చేశారు 52 వేల ఎకరాల పంట పొలాలకు నీరు అందించారు మేడారం నాగోబా జాతర్లకు నిధులు సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వం అని అన్నారు బంజారాహిల్స్ లో బంజారా భవనం ఇలా ఎన్నో గిరిజనుల సంక్షేమం

అభివృద్ధి కోసం చేశామని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వంలో గిరిజనుల గ్రామ పంచాయతీకి 25 లక్షల రూపాయలు ఇస్తామని మండలానికి ఒక గురుకుల పాఠశాల, పోడు భూములకు పట్టాలు, ఎరుకల, లంబాడ ,మాదిగ మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు ఇప్పటివకు చేసింది ఏమి లేదు అన్నారు ఎన్నికల ప్రచారంలో నర్సాపూర్ సభలో రేవంత్ రెడ్డి నియోజకవర్గంలో లంబాడ ప్రజలు ఎక్కువగా ఉన్నందున నియోజకవర్గంకు 100 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చారని ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఇచ్చిన దాఖల లేదని విమర్శించారు గిరిజన విద్యార్థులకు 10 పాస్ అయితే పదివేల ఇంటర్ పాస్ అయితే పదిహేను వేలు డిగ్రీ పాస్ అయితే 25000 పిజి పాస్ అయితే లక్ష రూపాయలు పీ హెచ్ డి చేస్తే ఐదు లక్షలు ఇస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు

**48 వేల కోట్లు రద్దు**

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నర్సాపూర్ నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణంకు కేటాయించిన కో 48 వేల కోట్ల రూపాయలను రద్దు చేసింది అని తాండాలలో ఎస్టీ ఎస్ డి ఎఫ్ కింద మంజూరు అయిన నిధులను రద్దు చేయడంతో తాండాలలో సీసీ రోడ్లకు నిధులు కేటాయించాలని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన పట్టింపు లేదని విమర్శించారు బీఆర్ఎస్ ప్రభుత్వ లోని గిరిజనులకు మేలు జరుగుతుందని రాబోయే ఎన్నికల్లో గిరిజనులు బిఆర్ఎస్ వెంట ఉంటారని ఆశాభావం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ చైర్మన్ నర్సాపూర్ అధ్యక్షులు భోగ శేఖర్ మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కౌన్సిలర్లు పాల్గొన్నారు

# హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి





- ఓటర్లు సమర్పించిన ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.
- జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

రామాయంపేట, సెప్టెంబర్ 15 (సిరి న్యూస్)

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-2026 (SIR) ప్రక్రియలో మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి హియరింగ్‌కు హాజరైన ఓటర్లు సమర్పిస్తున్న ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నాడు రామాయంపేట మండలంలోని అక్కన్నపేట, ఝాంసింగ్ లింగాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను మెదక్ ఆర్డీవో రమాదేవి, తాసిల్దార్ రజనీతోకలిసి కలెక్టర్ ప్రతిమాసింగ్ పరిశీలించారు. నోటీసుల జారీ, ఓటర్ల హియరింగ్, ఫారాల స్వీకరణ, అప్‌లోడింగ్ ప్రక్రియలను పర్యవేక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటర్లు సమర్పించే ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, వాటిపై తప్పనిసరిగా సంబంధిత ఓటర్ల సంతకాలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే 2002 సంవత్సరానికి చెందిన ఓటర్ల పేర్ల జాబితాను పరిశీలించి, సరిపోల్చుకోవాలని తెలిపారు. ఓటర్లు సమర్పించిన ఫారాలను పరిశీలించిన కలెక్టర్ అప్‌లోడింగ్ ప్రక్రియను కూడా తనిఖీ చేశారు. ప్రతిరోజు ఎంత మంది ఓటర్లు హియరింగ్‌కు వస్తున్నారు? ఎన్ని దరఖాస్తులు ధ్రువీకరిస్తున్నారు? అనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

నోటీసులు జారీ చేసిన ప్రతి వ్యక్తి హియరింగ్‌కు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు దొర్లకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. ఖచ్చితమైన ఓటరు జాబితాను సిద్ధం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్క ఓటరు వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రక్రియను నిర్వహించాలని, విధులు కేటాయించిన సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మానేగళ్ళ రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీవీఆర్ఐటీ లో 3డీ ప్రింటింగ్ శిక్షణ

- ఐదు రోజుల పాటు శిక్షణ
- విద్యార్థులలో సృజనాత్మకత,ఆవిష్కరణ మెరుగు

నర్సాపూర్ సెప్టెంబర్ 15 (సిరి న్యూస్)



బీవీ రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీవీఆర్ఐటీ)లో '3డీ ప్రింటింగ్ అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్' అంశంపై ఐదు రోజుల హ్యాండ్స్‌ఆన్ శిక్షణా కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ నెల 15 నుంచి 19 వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని ఫార్మాస్యూటికల్ ఇంజినీరింగ్ విభాగం, ఏఐసీటీఈఐడియా ల్యాబ్, డిజైన్ ల్యాబ్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ప్రారంభోత్సవానికి ఐఐటీ పాలక్కాడ్‌కు చెందిన డాక్టర్ కన్మణి సుబ్బు ఎస్. ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పరిశోధన, ఆవిష్కరణలు, పరిశ్రమల్లో 3డీ ప్రింటింగ్ సాంకేతికత వినియోగం తదితర అంశాలపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు ఆచరణాత్మకంగా నేర్చుకోవడం ద్వారా నూతన ఆవిష్కరణలకు దోహదపడుతుందని తెలిపారు. ఈ శిక్షణలో విద్యార్థులకు 3డీ డిజైనింగ్, ప్రింటింగ్, ప్రోటోటైప్ అభివృద్ధి తదితర అంశాల్లో ప్రత్యక్ష అనుభవాలను . సాంకేతిక నైపుణ్యాలతో పాటు సృజనాత్మకత,ఆవిష్కరణల పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెరుగుతుంది కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దూబే, డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, డీన్ డాక్టర్ వి. మురళీకృష్ణ, ఫార్మాస్యూటికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ పి. విష్ణు, డాక్టర్ ఎం. సుధీరతో పాటు పలువురు డీన్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు. కార్యక్రమ ఏర్పాట్లను కళాశాల మేనేజర్ శ్రీ బి. బాపిరాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీ సురేష్ సమన్వయంతో చేపట్టారు

# జంగమయ్య గుట్టలో శ్రావణమాసం సమాప్తి



సదాశివపేట. సెప్టెంబర్ 15. (సిరిన్యూస్)

సదాశివపేట మండలం తంగడపల్లి గ్రామంలోని శ్రీ కోటి బిల్వ లింగేశ్వర మఠం శ్రీ గురు గంగాధర మహా స్వామి ఆశ్రమం జంగమయ్య గుట్ట ఆశ్రమంలో శ్రావణమాస సమాప్తి కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు ఆశ్రమ పీఠాధితులు ష .బ్ర108 శ్రీశ్రీశ్రీ శివయోగి శివచార్య మహా స్వాములు తెలియజేశారు. శ్రీ గురు గంగాధర మహా స్వామి గురుపరంపరలో శ్రావణమాస శుక్ల పంచమి నుండి మొదలుకొని భాద్రపద శుక్ల పంచమి వరకు శ్రావణమాస అనుష్టాన కార్యక్రమం ఆశ్రమ ప్రాంగణంలో నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ అనుష్టాన కార్యక్రమంలో శ్రీ కోటి బిల్వ లింగేశ్వర మహాస్వామి వారికి నిత్యము రుద్రాభిషేకం మరియు పాదపూజ కార్యక్రమం మహా మంగళహారతి నిత్య అన్నదానోహము నిర్వహించినట్లు తెలియజేశారు. స్వామీజీ మాట్లాడుతూ మనకు ఉన్నటువంటి 12 మాసాలలో శివుడికి ప్రీతికరమైన మాసము మరియు గురు సేవకు ప్రీతికరమైన మాసము ఈ శ్రావణమాసం అని ఈ శ్రావణమాసంలో గురువులు బోధించేటటువంటి విషయాలను శ్రవణం చేసుకోవడం ఎంతో గొప్ప ఫలితాన్ని ఇస్తుందని తెలియజేశారు. శ్రీ కోటి బిల్వ లింగేశ్వర మహాస్వామి వారికి రుద్రాభిషేకం భిషేకము బిల్వర్చన పుష్పార్చన, స్వామివారి మహా పాదపూజ లక్షబిల్వర్చన కార్యక్రమం మహా మంగళహారతి మహా ప్రసాద నివేదన చేసినట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో అర్చక స్వాములు, వీరశైవ సమాజం సంగారెడ్డి జిల్లా, పటాన్చెరు సంగారెడ్డి సదాశివపేట సమాజ గౌరవ సభ్యులు మరియు సమస్త భక్త బృందం పాల్గొన్నారు.

# పర్యావరణ హితం.. పిండితో గణపతి విగ్రహం..





- శివ్వంపేటలో చిన్నారి ఆరాధ్య ఆలోచన

శివ్వంపేట సెప్టెంబర్ 15 ( సిరి న్యూస్ )

రసాయనాలతో తయారు చేసిన వినాయక విగ్రహాలు పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాయని ఓ చిన్నారి వినాయక చవితి సందర్భంగా సోమవారం గోధుమ పిండితో వినాయకుడి ప్రతిమ తయారు చేసింది. మెదక్ జిల్లా నర్సాపూర్ (రావెల్లి) ఎంజేపీ గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని శివ్వంపేట మండల కేంద్రానికి చెందిన రాజిపేట ఆరాధ్య వినూత్న ఆలోచనతో గోధుమ పిండితో వినాయకుడి ప్రతిమ, ఎలుక తయారు చేసి పూజించారు.. గతంలో ఆరాధ్య రాఖీ పౌర్ణమి సందర్భంగా పర్యావరణ హితం కోసం వినూత్న ఆలోచనతో అన్నయ్య ఆదిత్యకు కట్టడానికి డ్రైఫ్రూట్స్ తో రాఖీ తయారు చేశారు.

# నిమజ్జన్న ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్ శివాజీ



సదాశివపేట. సెప్టెంబర్ 15. (సిరిన్యూస్)

వినాయక నిమర్జనం ఏర్పాట్లలో భాగంగా మంగళవారం ఉదయం ఊబ చెరువు కట్టపై నిమర్జనం ప్రాంతాన్ని చైర్ పర్సన్ అంజమ్మ మునిపల్లి సత్యనారాయణ, కమిషనర్ శివాజీ, వైస్ చైర్ పర్సన్ రేణుక చిరు సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శివాజీ మాట్లాడుతూ వినాయక నిమజ్జనం ఏర్పాట్లను ఘనంగా జరుపుటకు 10 లక్షల రూపాలకు కౌన్సిల్ తీర్మానం తీసుకోవడం జరిగింది. దానిలో భాగంగా ఊబ చెరువు కట్టపై ఏర్పడినటువంటి గుంతలను మొరంతో పూడ్చుటం జరుగుతుంది, క్రేన్ల ఏర్పాటు చేయడం, ఎల్ఈడి లైట్లు, గాంధీ చౌక్ వద్ద స్టేజి ఏర్పాటు ఇతరత్రా సానిటరీకి సంబంధించిన పనులు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలోకౌన్సిలర్లు షజ్జీ, నర్సింలు, అనిత విష్ణువర్ధన్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సెకండ్ ఫేజ్ సీట్ల కేటాయింపు

హైదరాబాద్, సెప్టెంబర్ 15 :

ఎంబీబీఎస్ అడ్మిషన్ల కన్వీనర్ కోటా సెకండ్ ఫేజ్ సీట్ల కేటాయింపును 202627 విద్యా సంవత్సరానికి కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (కేఎనఆర్య□హెచఎస్) మంగళవారం విడుదల చేసింది. కాలేజీల వారీగా సీట్ల కేటాయింపు వివరాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. కన్వీనర్ కోటా సెకండ్ ఫేజ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 19న సాయంత్రం 4 గంటల లోపు తమకు సీట్లు కేటాయించిన కాలేజీల్లో చేరాలి. చేరే సమయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లు, బాండ్లు, ఇతర అవసరమైన పత్రాలను సమర్పించాలని యూనివర్సిటీ తెలిపింది. అలాగే, మేనేజ్‌మెంట్ కోటా కింద ఎంబీబీఎస్/బీడీఎస్ సీట్ల ఫస్ట్ ఫేజ్ కేటాయింపులను కూడా యూనివర్సిటీ విడుదల చేసింది. ఈ కేటగిరీలో సీట్లు పొందిన విద్యార్థులు సెప్టెంబర్ 19 సాయంత్రం 6 గంటల లోపు తమకు సీట్లు కేటాయించిన కాలేజీల్లో చేరాలి.

# జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు



- రామ్ మందిర్, గంజి మైదాన్, అంబేద్కర్ విగ్రహం, ఐబీ చౌరస్తా తదితర ప్రముఖ మండపాల్లో ప్రత్యేక పూజలు
- బైపాస్ రోడ్డు కాంగ్రెస్ కార్యాలయం వద్ద భరత్ సాయి రెడ్డి, పాలక్ పటేల్ దంపతుల ఆధ్వర్యంలో వేడుకలు
- ఉత్సవాల్లో పాల్గొన్న జయారెడ్డి, గుణ చైతన్య రెడ్డి దంపతులు..
- కాబోయే వధూవరులు భరత్ సాయి రెడ్డి-పాలక్ పటేల్, నిర్మలా జగ్గారెడ్డి

**సంగారెడ్డి, సెప్టెంబర్ 15 (సిరి న్యూస్):**

సంగారెడ్డి పట్టణంలో వినాయక చవితి వేడుకలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభ మధ్య నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో తొలి రోజు పూజా కార్యక్రమాల్లో ఆయన కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రామ్ మందిర్ వినాయక మండపం, వివేకానంద యూత్ అసోసియేషన్, చైతన్య యువజన సంఘం, ఐబీ యూత్ కాంగ్రెస్ గణేష్ మండపం, భరత్ సాయి రెడ్డి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాలు భక్తులతో కళకళలాడాయి. వేడుకల్లో భాగంగా తొలుత రామ్‌నగర్‌లోని రామ్ మందిర్ వద్ద వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జగ్గారెడ్డి స్వయంగా భజన చేస్తూ భక్తులతో కలిసి వీధుల గుండా ఊరేగింపుగా బ్రాహ్మణవాడకు చేరుకున్నారు. అక్కడి నుంచి మట్టి గణపతి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో తీసుకువచ్చి రామ్ మందిర్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ప్రతిష్ఠించారు. రామ్ మందిర్ యువసేన సభ్యుడు దత్తు ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజల్లోనూ జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, జగ్గారెడ్డి కుమారుడు భరత్ సాయి రెడ్డి పర్యవేక్షణలో గంజి మైదాన్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో జగ్గారెడ్డి కుమార్తె జయారెడ్డి, అల్లుడు గుణ చైతన్య రెడ్డి దంపతులు తొలి పూజలు నిర్వహించారు.

సంగారెడ్డి టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్ అధ్యక్షతన చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మండపంలోనూ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడు కూన సంతోష్ ఆధ్వర్యంలో ఐబీ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన గణేష్ మండపంలోనూ పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. బైపాస్ రోడ్డులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద తూర్పు భరత్ సాయి రెడ్డి యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో భరత్ సాయి రెడ్డి, ఆయన కాబోయే సతీమణి పాలక్ పటేల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి ప్రజలకు, అలాగే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలందరికీ జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనసారా ఆకాంక్షించారు.

# ట్రాన్స్‌కోలో అంతా పారదర్శకమే




- ట్రాన్స్‌కో జాయింట్ సెక్రటరీ గణేష్ స్పష్టీకరణ

**తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 15 (సిరి న్యూస్):**

తెలంగాణ ట్రాన్స్‌కోలో ఫెసిబిలిటీ జారీ ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయంటూ వస్తున్న వార్తలపై ట్రాన్స్‌కో యాజమాన్యం తీవ్రంగా స్పందించింది. ఈ మేరకు తెలంగాణ ట్రాన్స్‌కో జాయింట్ సెక్రటరీ గణేష్ ఒక అధికారిక ప్రకటన విడుదల చేస్తూ.. ట్రాన్స్‌కోలో ప్రతి ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, నిబంధనలకు లోబడి సాగుతోందని స్పష్టం చేశారు. 33 కేవీ మరియు అంతకంటే ఎక్కువ విద్యుత్ సరఫరా కోసం దరఖాస్తు చేసుకునే ప్రతి ఒక్కరూ విధిగా డిస్కమ్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, డిస్కమ్‌లు పరిశీలించిన తర్వాతే ఆ దరఖాస్తులు టీజీ ట్రాన్స్‌కోకు చేరుతాయని తెలిపారు. సరఫరా తప్పనిసరిగా ఈహెచ్‌టీ నెట్‌వర్క్ ద్వారా జరగాల్సి ఉన్నచోట ట్రాన్స్‌కో అధికారుల బృందం క్షేత్రస్థాయి పరిశీలన చేస్తుందని పేర్కొన్నారు. 220 కేవీ వరకు స్వయంగా, 400 కేవీ వద్ద సెంట్రల్ ఎలక్ట్రిసిటీ ఆథారిటీ, సీటీయూ, ఎస్ఆర్ఎల్‌డీసీ సహకారంతో సిస్టమ్ అధ్యయనాలు నిర్వహిస్తామని, ఆ తర్వాతే సాధ్యాసాధ్యాలను తెలియజేస్తామని వివరించారు. మహేశ్వరం, చందన్‌వల్లి డేటా సెంటర్ లోడ్‌ల కోసం కొత్త 765/400 కేవీ సోర్స్ కూడా ఈ పనులలో భాగమని స్పష్టం చేశారు. సుమారు 5 ఎంవీ కోసం దరఖాస్తు చేసుకునే 33 కేవీ స్థాయిలో.. పన్నెండు రోజుల్లోపు సగం దరఖాస్తులకు, ముప్పై మూడు రోజుల్లోపు పదింటిలో తొమ్మిది దరఖాస్తులకు సాధ్యాసాధ్యాలు మంజూరు చేయబడ్డాయి. 132 కేవీ వద్ద కూడా సగటు సమయం పన్నెండు రోజులేనని, సిస్టమ్ అధ్యయనం అవసరమయ్యే 220 కేవీ వద్ద సుమారు రెండు నెలలు, 400 కేవీ వద్ద కేంద్ర ఏజెన్సీల అధ్యయనం వల్ల ఎక్కువ సమయం పడుతుందని స్పష్టం చేశారు.

# సీజనల్ వ్యాధుల కట్టడికి ప్రత్యేక చర్యలు





- దోమల నివారణకు యాంటీ మస్కిటో స్ప్రే ప్రారంభం.

**రామాయంపేట, సెప్టెంబర్ 15 (సిరి న్యూస్)**

సీజనల్ వ్యాధులు, విష జ్వరాల వ్యాప్తిని అరికట్టేందుకు రామాయంపేట మున్సిపల్ పాలకవర్గం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఆదేశాల మేరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో దోమల నివారణ చర్యలకు శ్రీకారం చుట్టారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిలర్ గజవాడ నాగరాజు గుప్తా ఆధ్వర్యంలో యాంటీ మస్కిటో స్ప్రే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పట్టణంలోని వినాయక మండపాల వద్ద ప్రత్యేకంగా దోమల మందును పిచికారీ చేశారు. ఇటీవల పలు ప్రాంతాల్లో విషజ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పట్టణంలోని ప్రతి వీధిలో దోమల నివారణకు యాంటీ మస్కిటో స్ప్రే నిర్వహించడంతో పాటు, నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి పారిశుధ్య చర్యలు చేపడుతున్నట్లు కౌన్సిలర్ గజవాడ నాగరాజు గుప్తా తెలిపారు. ముఖ్యంగా వినాయక మండపాల వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో గుమిగూడే అవకాశం ఉన్నందున అక్కడ ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పాలకవర్గం సభ్యులు సూచించారు. దోమల వృద్ధికి అవకాశం కల్పించకుండా ప్రతి ఒక్కరూ మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటారని, అవసరమైన చోట్ల దోమల నివారణ మందు పిచికారీ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ లు గూగుల్లోతు రవి, పుట్టి సందీప్, దేవుని రంజిత్, పార్టీ నాయకులు డాకి స్వామి పాల్గొన్నారు

# విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో అందరి జీవితాల్లో సుఖశాంతులు నెలకొనాలి

- పర్యావరణ పరిరక్షణలో మట్టి విగ్రహాలు వినియోగించాలి
- ఎమ్మెల్యే చింత ప్రభాకర్
- సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినాయక చవితి వేడుకలు

**సంగారెడ్డి, సెప్టెంబర్ 15 (సిరి న్యూస్):**



సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారు ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారికి పుష్పాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యం పరిఢవిల్లాలని ఆకాంక్షించారు. వినాయక చవితి పర్వదినాన్ని ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలందరూ రసాయన విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీహరి, చింత సాయినాథ్, కొండల్ రెడ్డి, విఠల్, జీవీ శ్రీనివాస్, గోవర్ధన్ రెడ్డి, ఆంజనేయులు, శ్రవణ్ రెడ్డి, హరి ప్రసాద్, రవి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు క్యాంపు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# బెల్లంపల్లి కాంగ్రెస్‌లో అసమ్మతి భగ్గు!..





- బెల్లంపల్లి కాంగ్రెస్‌లో అసమ్మతి అగ్గి!..
- వినోద్‌పై కాంగ్రెస్ నేతల తిరుగుబాటు!..
- బెల్లంపల్లిలో కాంగ్రెస్‌లో కలకలం!
- గాంధీభవన్‌కు వెళ్లేందుకు నేతల హెచ్చరిక!..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 15 (సిరి న్యూస్)**

బెల్లంపల్లి కాంగ్రెస్‌లో అసమ్మతి జ్వాలలు కార్చిచ్చులా వ్యాపించాయి! ఎమ్మెల్యే గడ్డం వినోద్ తీరుపై సీనియర్ నేతలు, కార్యకర్తలు నేరుగా బాహాటంగా తిరుగుబాటు శంఖారావం పూరించారు. పార్టీ కోసం రక్తమాంసాలు ధారపోసిన తమను నట్టేట ముంచి, ఇతర పార్టీల నుంచి దిగుమతైన వారికే రాచమర్యాదలు చేస్తున్నారంటూ కడుపు మండి ఆవేదన వెళ్లగక్కారు. ఎమ్మెల్యే వైఖరిలో మార్పు రాకుంటే నేరుగా అధిష్ఠానం ముందుకే వెళ్తామంటూ ఫైనల్ వార్నింగ్ ఇచ్చేశారు. దీంతో నియోజకవర్గ రాజకీయాల్లో పెను భూకంపం సంభవించింది!..

**ఎమ్మెల్యే పర్యటన వేళే గూడుపుఠాణీనా?..**

మంగళవారం బెల్లంపల్లి కాంగ్రెస్ కార్యాలయంలో సీనియర్ నేత మత్తమరి సూరిబాబు సారథ్యంలో జరిగిన ముఖ్య కార్యకర్తల భేటీ రాజకీయ వర్గాల్లో సంచలన తుఫానును రేపింది. ఎమ్మెల్యే గడ్డం వినోద్ నియోజకవర్గంలో పర్యటిస్తున్న అదే వేళలో ఈ ప్రత్యేక సమావేశం జరగడంతో ఇది కేవలం కాకతాళీయమా, లేక ఎమ్మెల్యేను ఇరుకున పెట్టేందుకు పన్నిన పక్కా వ్యూహమా అన్న చర్చ నియోజకవర్గమంతటా వేడెక్కింది. పార్టీ కోసం కష్టపడ్డ వారికి తక్షణమే గుర్తింపు, పదవులు కట్టబెట్టాలంటూ నేతలు గట్టిగా డిమాండ్ చేశారు. అందరినీ కలుపుకొని ప్రజా సమస్యలపై పనిచేస్తేనే బెల్లంపల్లిలో కాంగ్రెస్‌కు భవిష్యత్ ఉంటుంది, లేదంటే పార్టీ తుడిచిపెట్టుకుపోతుంది అన్న రీతిలో తీవ్ర హెచ్చరిక చేశారు..



**నాతరి స్వామి పేలుడు వ్యాఖ్యలు, నేరుగా నాయకత్వంపై అగ్నిపరీక్ష!..**

టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి నేరుగా నాయకత్వంపైనే విరుచుకుపడి సంచలన వ్యాఖ్యలు చేశారు. భట్టి విక్రమార్క పాదయాత్ర సమయంలో పార్టీ కోసం కాళ్లరిగేలా తిరిగిన వారిని ప్రస్తుత నాయకత్వం గుర్తించడం లేదని నిప్పులు చెరిగారు. గతంలో బీజేపీ, బీఆర్ఎస్‌లలో ఉన్నవారికే రెడ్‌కార్పెట్ పరుస్తుండగా, నిజమైన కాంగ్రెస్ సైనికులను రోడ్డున పడేశారని ఆగ్రహోదగ్రులయ్యారు. మండల స్థాయిలో కొందరు ఏకపక్ష పెత్తనం, నియంతృత్వ ధోరణి ప్రదర్శిస్తున్నారంటూ నేరుగా వేలెత్తి చూపారు..

**నేతల మహా సమీకరణ.. భారీ బలప్రదర్శన!..**

ఈ సమావేశానికి ఎండీ అబ్జల్, మునిమంద రమేష్, నయుం బాయ్, రొడ్డ శ్యామ్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చిప్ప మనోహర్, మాజీ కౌన్సిలర్ బొడ్డు నారాయణ, మాజీ ఫ్లోర్ లీడర్ కటకం సతీష్‌తో సహా అనేకమంది సీనియర్ నేతలు, కార్యకర్తలు పోటెత్తి తమ ఐక్యతను, బలాన్ని ప్రదర్శించారు. ఇది ఎమ్మెల్యేకు స్పష్టమైన డేంజర్ బెల్ అని రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు..

**క్లైమాక్స్ ట్విస్ట్..గాంధీభవన్‌పై దండ-యాత్రకు రెడీ!..**

పలుమార్లు మొరపెట్టుకున్నా ఇసుమంతైనా మార్పు రాలేదు అంటూ ఆగ్రహావేశాలతో రగిలిపోయిన నేతలు, ఇక సహనం పూర్తిగా నశించిందని బాహాటంగా ప్రకటించారు. విషయాన్ని నేరుగా అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లేందుకు గాంధీభవన్‌పై దండయాత్ర చేస్తామని సవాలు విసిరారు, దీంతో బెల్లంపల్లి కాంగ్రెస్‌లో రాబోయే రోజుల్లో మరిన్ని పెను రాజకీయ ప్రకంపనలు, పార్టీలో చీలిక భయాలు తప్పవన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మొత్తానికి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు ఇది గట్టి షాక్‌గా మారింది, ఆయన ఇప్పుడు ఏ వ్యూహంతో ముందుకెళ్తారో వేచి చూడాల్సిందే!.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.

www.siridaily.com
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice వార్తపత్రిక
బుధవారం
సెప్టెంబర్-16-2026
సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 249
MEDAK, SANGAREDDY, SIDDIPET
పేజీలు : 4

## వినాయక మండపాల వద్ద పోలీసుల ముమ్మర తనిఖీలు

### భద్రతకే ప్రథమ ప్రాధాన్యం.. అవాంఛనీయ ఘటనలకు చెక్



రామచంద్రాపురం, సెప్టెంబర్ 15 (సిరి న్యూస్): వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని రామచంద్రారెడ్డి కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని పోలీసులు, బాంబ్ డిస్పోజల్ (బిడి) స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో కలిసి తనిఖీ చేశారు.

3

# అర్హతకు మించి వైద్యం.. ప్రాణాలతో చెలగాటం!



### పరాకాష్టకు కొందరు ఆర్ఎంపీ, పీఎంపీల వైద్యం

- అవసరం లేకున్నా యాంటి బయోటిక్స్, ఇంజక్షన్లు
- సాధారణ జబ్బులకూ అధిక మోతాదులో డ్రగ్స్ వినియోగం
- ఇంజక్షన్ వేస్తేనే తగ్గుతుందంటూ రోగులకు తప్పుడు నమ్మకం
- అనవసరంగా స్టెరాయిడ్స్, హైడోస్ మందులు
- ఓవర్ డోస్‌తో తలెత్తుతున్న తీవ్ర దుష్ప్రభావాలు
- గ్రామీణ అమాయకత్వమే ఆసరాగా ధన దోపిడీ
- క్లినిక్‌లలో అక్రమ మందుల నిల్వలపై పర్యవేక్షణ శూన్యం

**మెదక్ జిల్లాలో వైద్యం పేరుతో దందా**




**నిద్రమత్తులో జోగుతున్న డ్రగ్స్ కంట్రోల్ అధికార యంత్రాంగం**

ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్ల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. అర్హతకు మించి వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మెదక్ జిల్లావ్యాప్తంగా గ్రామీణ, మండల కేంద్రాల్లో కేవలం ప్రథమ చికిత్స (ఫస్ట్ ఎయిడ్) చేయడానికి మాత్రమే పరిమితమైన వీరు.. తమ పరిధిని, అర్హతను పూర్తిగా మరిచిపోయి ఏకంగా ఎంబీబీఎస్, ఎండీ నిపుణుల తరహాలో కార్పొరేట్ వైద్యం నడిపిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సరైన ప్రభుత్వ వైద్య సదుపాయాలు లేకపోవడం, ప్రజల్లో ఉన్న అవగాహన లోపాన్ని ఆసరాగా చేసుకుని కొందరు క్లినిక్‌ల బోర్డులు పెట్టి నిలువునా దోపిడీకి తెరలేపారు. రోగి ప్రాథమిక ఆరోగ్య పరిస్థితిని, పూర్వ చరిత్రను ఏమాత్రం పరిశీలించకుండానే అడ్డగోలుగా మందులు, ఇంజక్షన్లు రాసిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

2

(ప్రత్యేక ప్రతినిధి-సిరి న్యూస్)

# పూర్వ ప్రాథమిక విద్య బలోపేతం కావాలి

- ఎఫ్ ఎల్ ఎన్ లక్ష్యసాధనలో ముందుండాలి
- మధ్యాహ్న భోజనం నాణ్యతతో అందించాలి
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- మధ్యాహ్న భోజనంలో నాణ్యత తప్పనిసరి
- నాణ్యమైన విద్యే లక్ష్యంగా పనిచేయాలి
- విద్యార్థులతో కలిసి కూర్చున్న కలెక్టర్
- బోధన తీరును స్వయంగా పరిశీలన
- మౌలిక వసతులపై ఆరా.. విద్యార్థులతో ముచ్చట

## అక్కన్నపేట పాఠశాలల్లో కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆకస్మిక తనిఖీ

3

పూర్వ ప్రాథమిక విద్యకు పటిష్ఠ పునాది వేయాలి.. ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాలను సాధించేలా బోధన సాగాలి.. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.. మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజీ పడొద్దని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. అక్కన్నపేటలోని ప్రీ-ప్రైమరీ, ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యా ప్రమాణాలను పరిశీలించారు.







# అర్హతకు మించి వైద్యం.. ప్రాణాలతో చెలగాటం!

## పరాకాష్టకు కొందరు ఆర్ఎంపీ, పీఎంపీల వైద్యం

- అవసరం లేకున్నా యాంటి బయోటిక్స్, ఇంజక్షన్లు
- మెదక్ జిల్లాలో వైద్యం పేరుతో దందా
- సాధారణ జబ్బులకూ అధిక మోతాదులో డ్రగ్స్ వినియోగం
- ఇంజక్షన్ వేస్తేనే తగ్గుతుందంటూ రోగులకు తప్పుడు నమ్మకం
- అనవసరంగా స్టెరాయిడ్స్, హైడోస్ మందులు
- ఓవర్ డోస్‌తో తలెత్తుతున్న తీవ్ర దుష్ప్రభావాలు
- గ్రామీణ అమాయకత్వమే ఆసరాగా ధన దోపిడీ
- క్లినిక్‌లలో అక్రమ మందుల నిల్వలపై పర్యవేక్షణ శూన్యం
- నిద్రమత్తులో జోగుతున్న డ్రగ్స్ కంట్రోల్ అధికార యంత్రాంగం

(ప్రత్యేక ప్రతినిధి-సిరి న్యూస్) : ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్ల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. అర్హతకు మించి వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మెదక్ జిల్లావ్యాప్తంగా గ్రామీణ, మండల కేంద్రాల్లో కేవలం ప్రథమ చికిత్స (ఫస్ట్ ఎయిడ్) చేయడానికి మాత్రమే పరిమితమైన వీరు.. తమ పరిధిని, అర్హతను పూర్తిగా మరిచిపోయి ఏకంగా ఎంబీబీఎస్, ఎండీ నిపుణుల తరహాలో కార్పొరేట్ వైద్యం నడిపిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సరైన ప్రభుత్వ వైద్య సదుపాయాలు లేకపోవడం, ప్రజల్లో ఉన్న అవగాహన లోపాన్ని ఆసరాగా చేసుకుని కొందరు క్లినిక్‌ల బోర్డులు పెట్టి నిలువునా దోపిడీకి తెరలేపారు. రోగి ప్రాథమిక ఆరోగ్య పరిస్థితిని, పూర్వ చరిత్రను ఏమాత్రం పరిశీలించకుండానే అడ్డగోలుగా మందులు, ఇంజక్షన్లు రాసిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### పరిమితి దాటినా చర్యలు శూన్యం..

ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు అందరూ నిబంధనలు ఉల్లంఘించకపోయినప్పటికీ.. అర్హతకు మించి శస్త్రచికిత్సలు, అబార్షన్లు, డెలివరీలు, సెలైన్ బాటిళ్లు పెడుతూ అక్రమాలకు పాల్పడే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. క్షేత్రస్థాయిలో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. నిబంధనలను బేఖాతరు చేస్తూ ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం చేస్తున్న వారిపై కనీసం క్రిమినల్ కేసులు నమోదు చేయకపోవడంతో ఈ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది.ప్రజారోగ్య రక్షణకు తనిఖీలు చేపట్టాలి పల్లె ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, డ్రగ్స్ కంట్రోల్ అధికారులు సంయుక్తంగా రంగంలోకి దిగాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఫస్ట్ ఎయిడ్ సేవలు మాత్రమే అందించేలా ఆర్ఎంపీలపై స్పష్టమైన నిఘా ఉంచాలని, అర్హత లేకుండా ఇంజక్షన్లు, స్టెరాయిడ్స్ వాడే బోగస్ కేంద్రాలపై ఆకస్మిక దాడులు నిర్వహించాలని కోరుతున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే నకిలీ వైద్యుల క్లినిక్‌లను తక్షణమే సీజ్ చేసి, నిర్వాహకులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

### డోసు మించితే దుష్ప్రభావాల ముప్పు..

మందుల వినియోగం అనేది రోగి వయస్సు, శరీర బరువు, ఇతర దీర్ఘకాలిక సమస్యల ఆధారంగా అత్యంత జాగ్రత్తగా జరగాలి. అయితే పల్లెల్లోని కొందరు ఆర్ఎంపీలు రోగి వచ్చిన వెంటనే రోగ నిర్ధారణ చేయకుండానే చేతికి అందిన హైడోస్ యాంటీబయాటిక్స్, నిషేధిత స్టెరాయిడ్లను కట్టబెడుతున్నారు. తక్షణ ఉపశమనం కోసం ఇచ్చే ఈ అధిక మోతాదు మందుల వల్ల రోగుల కిడ్నీలు, కాలేయం దెబ్బతినే ప్రమాదం పొంచి ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మందుల తీవ్రతకు రోగులు ఇతర సైడ్ ఎఫెక్ట్స్ బారిన పడుతున్నప్పటికీ, గ్రామీణ ప్రజలు ఆ విషయాన్ని గ్రహించలేక మరింత అనారోగ్యం పాలవుతున్నారు.

### ఇంజక్షన్ వేస్తేనే తగ్గుతుందా?

పల్లెటూళ్లలో ఇంజక్షన్ వేయించుకుంటేనే రోగం వెంటనే తగ్గుతుంది అనే ఒక బలమైన తప్పుడు నమ్మకం ప్రజల్లో ఉంది. ఈ అమాయకత్వాన్ని కొందరు ఆర్ఎంపీలు పక్కాగా క్యాష్ చేసుకుంటున్నారు. సాధారణ జలుబు, దగ్గు, తలనొప్పి వంటి చిన్నపాటి రుగ్మతలకు సైతం ఏమాత్రం అవసరం లేకపోయినా డ్రిప్పులు పెట్టడం, విచ్చలవిడిగా ఇంజక్షన్లు పొడవడం పరిపాటిగా మారింది. ప్రతి చిన్న సమస్యకూ ఇంజక్షన్ అవసరం లేదని మెడికల్ కౌన్సిల్ చెబుతున్నప్పటికీ.. ఒక్కో ఇంజక్షన్‌కు వందల రూపాయలు వసూలు చేస్తూ రోగుల జేబులకు చిల్లులు పెడుతున్నారు.

### డ్రగ్స్ కంట్రోల్ అధికారులు ఎక్కడ?

జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో పుట్టగొడుగుల్లా వెలిసిన ఆర్ఎంపీ క్లినిక్‌లపై సంబంధిత డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ క్లినిక్‌లలో ఎలాంటి మందులను నిల్వ చేస్తున్నారు? వాటిని ఏ ఏజెన్సీల నుంచి కొనుగోలు చేశారు? బిల్లులు ఉన్నాయా లేదా? ఎక్స్‌పైరీ మందులను రోగులకు అంటగడుతున్నారా? అనే అంశాలను తనిఖీ చేయాల్సిన అధికారులు కార్యాలయాలకే పరిమితమయ్యారన్న విమర్శలు వస్తున్నాయి. డ్రగ్స్ నిబంధనలకు విరుద్ధంగా ఔషధాలను ఆర్ఎంపీలు ఎలా నిల్వ చేసుకుంటున్నారన్నది మింగుడుపడటం లేదు.







# పూర్వ ప్రాథమిక విద్య బలోపేతం కావాలి

- ఎఫ్ ఎల్ ఎన్ లక్ష్యసాధనలో ముందుండాలి
- మధ్యాహ్న భోజనం నాణ్యతతో అందించాలి
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- మధ్యాహ్న భోజనంలో నాణ్యత తప్పనిసరి
- నాణ్యమైన విద్యే లక్ష్యంగా పనిచేయాలి
- విద్యార్థులతో కలిసి కూర్చున్న కలెక్టర్
- బోధన తీరును స్వయంగా పరిశీలన
- మౌలిక వసతులపై ఆరా.. విద్యార్థులతో ముచ్చట

## అక్కన్నపేట పాఠశాలల్లో కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆకస్మిక తనిఖీ




**రామాయంపేట, సెప్టెంబర్ 15 (సిరి న్యూస్)** రామాయంపేట మండలం అక్కన్నపేట మండలంలో ప్రీ ప్రైమరీ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ తనిఖీ చేశారు.పూర్వ ప్రాథమిక విద్య బలోపేతం కావాలని, ఎఫ్ ఎల్ ఎన్ లక్ష్య సాధనలో దుండాలని,మధ్యాహ్న భోజనం నాణ్యతతో విద్యార్థులకు అందించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఉపాధ్యాయులకు సూచించారు మంగళవారం రోజున రామాయంపేట మండలం అక్కన్నపేట మండలంలో ప్రీ ప్రైమరీ , మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలను మొత్తం సందర్శించి విద్యార్థుల స్థితిగతులను, వారికి కల్పిస్తున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాల గురించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారా లేదా అని విద్యార్థులతో పాటు క్లాస్ రూమ్ లో కూర్చుని టీచర్ బోధనను అలాగే విద్యార్థులు మన్నన చేసుకునే విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట గ్రామ సర్పంచ్ బక్కన్న గారి యాదగిరి తో పాటు సంబంధిత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

---

# వినాయక మండపాల వద్ద పోలీసుల ముమ్మర తనిఖీలు




- భద్రతకే ప్రథమ ప్రాధాన్యం..

**అవాంఛనీయ ఘటనలకు చెక్**

రామచంద్రాపురం, సెప్టెంబర్ 15 (సిరి న్యూస్) : వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని రామచంద్రారెడ్డి కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని పోలీసులు, బాంబ్ డిస్పోజల్ (బిడి) స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో కలిసి తనిఖీ చేశారు. మండపం పరిసరాలు, వేదిక కింద భాగాలను మెటల్ డిటెక్టర్లతో పరిశీలించారు. అనుమానాస్పద వస్తువుల కోసం డాగ్ స్క్వాడ్‌తోనూ తనిఖీలు నిర్వహించారు. రద్దీగా ఉండే మండపాల వద్ద సీసీటీవీలు ఏర్పాటు చేసి, 4 నుంచి 5 మంది వాలంటీర్లు అందుబాటులో ఉండేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. విద్యుత్, అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, రాత్రి వేళల్లో మండపాల వద్ద నిర్వాహకులు లేదా వాలంటీర్లు ఉండేలా చూడాలని పోలీసులు సూచించారు. శబ్ద కాలుష్య నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు భక్తులు, నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని అధికారులు కోరారు.